


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5





ఎంపీ, ఎమ్మెల్యేలను ఉద్దేశించి మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు





సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సురేష్, ఎంపీ వేమిరెడ్డి తదితరులు



మంత్రి నారాయణ, ఎమ్మెల్యే ఇంటూరి



మంత్రి ఆనం

తప్పు చేసిన వారిని వదిలిపెట్టం!

కానీ, కక్ష సాధింపు చర్యలొద్దు..!

ఎమ్మెల్యేలు, ఎంపీలకు చంద్రబాబు దిశానిర్దేశం

నెల్లూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : 'మొన్నటి ఎన్నికల్లో కూటమి పార్టీలు 93 శాతం సీట్లు గెలిచాయంటే దానికి మేమే కారణమని అత్యధిక శాతం మంది ప్రజలు భావిస్తున్నారు. ఇది నిజమే. కొంతమంది ఇతర దేశాల నుంచి రూ.లక్షలు ఖర్చు పెట్టి ఇక్కడికి వచ్చి కూటమికి ఓటేశారు. వారిలోనూ తమ వల్లే కూటమి గెలిచిందనే అభిప్రాయం ఉంటోంది. ఇది కూడా నిజమే. వీరంతా కూటమి ప్రభుత్వంలో మేలు జరుగుతుందని, హాయిగా ఉండొచ్చని ఆశించారు.

గత ప్రభుత్వంలో కొందరు నాయకులు జైలుకు పోయారు. కొందరు వేధింపులకు గురయ్యారు. కార్యకర్తలు నిద్రలేని రాత్రులు గడిపారు. దీనికి కారణం గత ప్రభుత్వ అరాచక పాలన. ఇప్పుడు మనం కూడా కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే గత ప్రభుత్వానికి, మనకు తేడా ఏముంటుంది. తప్పు చేసిన వారిని వదిలిపెట్టం. కానీ కక్ష సాధింపు చర్యలొద్దు. గతంలో నాయకులు చేసినట్లు ఎవరినీ కక్షగట్టి వేధించవద్దు.' అని ఎమ్మెల్యేలు, ఎంపీలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హితబోధ చేశారు. తప్పు చేయవద్దని, తప్పు చేసిన వారిని చట్టబద్ధంగా కట్టడి చేయాలి తప్ప గత ప్రభుత్వంలో ఇబ్బందులు పెట్టారనే కారణంగా ఎవరిపైనా కక్ష సాధింపు చర్యలకు పూనుకోవద్దని, ఇది ప్రజల్లో చెడ్డ పేరు తెస్తుందని అన్నారు. శుక్రవారం అమరావతిలో జరిగిన ఎమ్మెల్యేలు, ఎంపీల సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ సహకార సంఘాలు, నీటి సంఘాలకు త్వరలో నామినేటెడ్ కమిటీలు వేస్తామని, ఆరు నెలల్లో వీటికి ఎన్నికలు జరుపుతామన్నారు. ప్రతి నియోజకవర్గం ఒక ఇండస్ట్రియల్ హబ్‌గా తయారు కావాలని అందుకు స్థానిక ఎమ్మెల్యేలు చొరవ చూపాలని, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లాకు చెందిన మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరరావు, కురుగుండ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అధికారం ఉంది కదా అని

అడ్డగోలుగా దోచి పెట్టారు!

- పొదలకూరులో ప్రభుత్వ భూముల ధారాదత్తం
- విచారణలో తేలిన నిజాలు.. చర్యలకు రంగం సిద్ధం



అధికారం మా చేతుల్లో ఉంటే ఇక అడ్డు చెప్పేదెవరు అన్న ధోరణిలో వైసీపీ నేతలు వ్యవహరిస్తే... అధికార పార్టీ నేతలే చెబుతున్నప్పుడు ఇక మనల్ని ప్రశ్నించేది ఎవరు.. అన్న ధోరణిలో పొదలకూరు మండల రెవెన్యూ సిబ్బంది ఇష్టారీతిన వ్యవహరించారు. రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములను వైసీపీ నేతలు, వారి బంధువులకు దోచిపెట్టారు. నాడు ఈ అక్రమాలపై ఫిర్యాదులు అందినా ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాటి అరాచకాలు వెలుగులోకి వస్తున్నాయి. భూ అక్రమాలపై ఫిర్యాదుల నేపథ్యంలో విచారణ జరిపిన జిల్లా ఉన్నతాధికారులు.. అవన్నీ వాస్తవాలని తేల్చారు. త్వరలోనే చాలా మందిపై వేటు పడే అవకాశం ఉన్నట్లు రెవెన్యూ వర్గాల్లో చర్చలు నడుస్తున్నాయి. ప్రస్తుతం ఈ వ్యవహారం రెవెన్యూలో కలకలాన్ని రేపుతోంది.

6

భూ ప్రక్షాళనకు శ్రీకారం

'జగనన్న భూ రక్ష' సమస్యల పరిష్కారంపై దృష్టి

అప్పట్లో రీసర్వే జరిగిన గ్రామాల్లో నేటినుంచి సభలు

ప్రజల నుంచి వినతుల స్వీకరణ

నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జగనన్న భూ రక్ష పేరిట గత వైసీపీ సర్కారు గ్రామాల్లో చేపట్టిన భూముల రీసర్వే వివాదాస్పదమైంది. దీంతో మళ్లీ గ్రామస్థుల అభిప్రాయాల సేకరణకు శనివారం నుంచి గ్రామసభలు నిర్వహించనున్నారు. నవంబరు నెలాఖరు వరకు రీసర్వే పూర్తయిన గ్రామాలలోనే ఈ సభలు జరగనున్నాయి. దీర్ఘకాలంగా ఉన్న భూ సమస్యలు రీసర్వేతో పరిష్కారం అవుతాయని అప్పటి వైసీపీ ప్రభుత్వం గొప్పగా ప్రకటించుకుంది. అయితే క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా జరిగింది. జిల్లాలోని 737 గ్రామాల్లో జగనన్న భూ రక్ష రీసర్వే చేపట్టాలని భావించారు. అయితే, 329 గ్రామాలలో సర్వే సంపూర్ణంగా జరిగింది. ఈ సర్వే రైతులకు అదనపు తలనొప్పులను తీసుకొచ్చింది. ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు అందడంతో ప్రస్తుత కూటమి ప్రభుత్వం జగనన్న భూరక్షను రద్దు చేసింది. రీసర్వే వల్ల ఉత్పన్నమైన సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టి, బాధితులకు న్యాయం చేయాలని నిర్ణయించింది.

• అధికారుల బృందం

గ్రామాలలో గ్రామసభల నిర్వహణకు అధికారుల బృందం ఏర్పాటైంది. ఈ బృందంలో తహసీల్దారు, డిప్యూటీ తహసీల్దారు, మండల సర్వేయర్, విలేజ్ సర్వే అధికారులు ఉంటారు. గ్రామసభల్లో భూ సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారు.

• ఆ పాసుపుస్తకాల రద్దు!

వైసీపీ ప్రభుత్వంలో జగన్ చిత్రాలతో పట్టాదారు పాసుపుస్తకాలను ముద్రించి రైతులకు అందచేశారు. హద్దురాళ్ల మీద కూడా జగన్ ఫొటోలను ముద్రించారు. అయితే, పాస్‌పుస్తకాలపై జగన్ ఫొటో ఉండటంతో కొన్నిచోట్ల బ్యాంకర్లు రుణాలు ఇవ్వలేదు. రైతుల పరిస్థితిని అర్థం చేసుకున్న కూటమి ప్రభుత్వం జగన్ ఫొటోలతో ఉన్న పాస్ పుస్తకాలను రద్దు చేసి, అధికార రాజముద్ర ఉన్న పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తామని ప్రకటించింది.

• విస్తీర్ణం తగ్గిందనీ..

వైసీపీ ప్రభుత్వం చేపట్టిన భూ సర్వేలో విస్తీర్ణం తగ్గిందనే ఫిర్యాదులు అధికంగా వచ్చాయి. రాజకీయ కారణాలతో భూ విస్తీర్ణాన్ని తగ్గించి చూపెట్టారని కొందరు, మృతులనూ హక్కుదారులుగా నమోదు చేశారని ఇంకొందరు ఫిర్యాదు చేశారు. గతంలో ఉన్న భూ కొలతలకు భిన్నంగా రీసర్వేలో తేడాలు వచ్చాయనీ, యజమాని పేరు మార్పు, భూసరిహద్దుల్లో లోపాలు తదితర సమస్యలు ఉత్పన్నమయ్యాయి. భూ హక్కుదారు లేకపోతే అక్కడ ఎవరినో అడిగి వివరాలను నమోదు చేయడం తాము నష్టపోయామంటూ కూడా ఫిర్యాదు వెల్లువెత్తాయి. ఇవే ఫిర్యాదులు కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో, ఆర్డీఓలకు, తహసీల్దార్లకు, ప్రజాప్రతినిధులకు అందాయి. ఈ సమస్యలను పరిష్కరించడానికి కూటమి ప్రభుత్వం తాజాగా గ్రామసభలు నిర్వహిస్తోంది.

అర్జీలకు శాశ్వత పరిష్కారం

గతంలో జరిగిన భూముల రీసర్వేకు సంబంధించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడానికే ఈ గ్రామసభలు నిర్వహిస్తున్నాం. ఈ గ్రామ సభల్లో వచ్చిన అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపుతాం.

- కార్తీక్, జాయింట్ కలెక్టర్

సభల్లో సమస్యలు తెలపండి

రీసర్వే పూర్తయిన గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించడానికి అన్నీ ఏర్పాట్లు చేశాం. సర్వే జరిగిన ప్రాంతాలలోని భూ హక్కుదారులు ఈ సభల్లో పాల్గొని సమస్యలు తెలియచేయాలి. జాయింట్ కలెక్టర్‌తోపాటు నేను కూడా సభల్లో పాల్గొంటా.

- నాగశేఖర్, అసిస్టెంట్ డైరెక్టర్, జిల్లా సర్వే శాఖ



ఆత్మకూరు: భూముల వివరాలను తెలుసుకుంటున్న కలెక్టరు ఆనంద్

రైతులను ఆదుకుంటాం!

నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్ కోసం భూసేకరణ జరుగుతున్న ఆత్మకూరు, చేజర్ల, పొదలకూరు మండలాల్లో కలెక్టర్ ఆనంద్ శుక్రవారం పర్యటించారు. భూ యజమానులు, రైతులతో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా భూములను అవార్డు చేసే సమయంలో రెండు పంటలకు పండే సారవంతమైన భూములకు అది తక్కువ ధర నిర్ణయించినందున తాము తీవ్రంగా నష్టపోతున్నట్లు పేర్కొన్నారు. భూసేకరణలో రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

7

ఇసుక రవాణా టెండర్ల రద్దు

- లక్కీ డిప్‌పై పలువురు కాంట్రాక్టర్ల ఫిర్యాదు
- కఠిన నిబంధనలతో రీ టెండర్లు పిలుస్తాం: కలెక్టర్
- అప్పటి వరకు నామినేషన్ పద్ధతిలో తరలింపు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రీచ్‌ల నుంచి స్టాక్ యార్డులకు ఇసుకను తరలించేదుకు పిలిచిన టెండర్లను కలెక్టర్ ఓ ఆనంద్ శుక్రవారం రద్దు చేశారు. విరువూరు, మినగల్లు, పల్లిపాడు, పీకేపాడు రీచ్‌ల నుంచి ఇసుకను సమీపంలోని స్టాక్ పాయింట్ల కు తరలించేందుకు కాంట్రాక్టర్ల నుంచి టెండర్‌లను ప్రభుత్వం ఆహ్వానించిన విషయం విదితమే. టన్ను ఇసుక తరలింపునకు సరాసరి రూ.115 ఖర్చవుతుందని అధికారులు అంచనా చేశారు. అయితే గురువారం టెండర్ వేసిన దాదాపు 43 మందిలో చాలా వరకు అధికారుల అంచనా కన్నా తక్కువ మొత్తానికి కోట్ వేశారు. రూ.36కు కూడా స్టాక్ పాయింట్‌కు చేరుస్తామని బిడ్ వేయడంతో కలెక్టర్ స్పందిస్తూ లక్కీ డిప్ ద్వారా టెండర్ అప్పగిస్తామని, ప్రభుత్వం అంచనా వేసిన ధర రూ.115కు తరలించాలని ఆదేశించారు. డిప్ తీసి నలుగురికి పనులు అప్పగించారు. కలెక్టర్ నిర్ణయాన్ని కాంట్రాక్టర్లు తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రభుత్వ పెద్దలకు, మంత్రులకు, స్థానిక ఎమ్మెల్యేలకు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ మొత్తం టెండర్లు, లక్కీడిప్‌ను పూర్తిగా రద్దు చేశారు. కఠిన నిబంధనలతో మళ్లీ టెండర్లు పిలవనున్నట్లు ప్రకటించారు. అప్పటి వరకు రీచ్‌ల నుంచి ఇసుకను నామినేషన్ పద్ధతిలో స్టాక్ పాయింట్లకు తరలించేలా మైనింగ్‌శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇసారైనా టెండర్ల ప్రక్రియ సక్రమంగా సాగుతుందో.. లేదో చూడాలి.

ప్రభుతకు పట్టని పుస్తక కేంద్రాలు

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు. వేలాది పుస్తకాలతో అన్ని వయసుల వారికి సమాచారాన్ని, విజ్ఞానాన్ని అందించే నిలయాలు. అటు వంటి గ్రంథాలయాలు జిల్లాలో అభివృద్ధికి నోచుకోవడం లేదు. జిల్లా ప్రధాన గ్రంథాలయంలోనే కూర్చోవాలంటే పాఠకులు భయపడుతున్నారు. కొత్త భవనం పూర్తికాక, ఉన్నదేమో శిథిలమై, నూతనత్వానికి నిధుల్లేక జిల్లా గ్రంథాలయ సంస్థ భారంగా రోజులు ఈడుస్తోంది.

- అభివృద్ధికి నోచని గ్రంథాలయాలు
- శిథిల భవనాల్లో పుస్తక పఠనం
- సెస్సు బకాయిలు రూ.40కోట్లు
- నత్తనడకన కొత్త భవనం నిర్మాణం
- పాలక మండలి లేక కదలిక శూన్యం

జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనం



నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రధాన గ్రంథాలయంతోపాటు జిల్లాలో 61 శాఖలున్నాయి. వీటిలో నెల్లూరు రేబాల వారి వీధిలోని ప్రధాన గ్రంథాలయ, గ్రంథాలయ సంస్థ కార్యాలయ భవనం సుమారు వందేళ్ల కిందటిది. ఆ భవంతి శిథిలమై పైకప్పు కూలేందుకు సిద్ధంగా ఉంది. పెచ్చులూ డిపడి పాఠకులను భయ భ్రాంతులకు గురి చేస్తోంది. ఈ నేపథ్యంలో నూతన భవన నిర్మాణానికి 2019లో అప్పటి, ప్రస్తుత మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ రూ.3కోట్లు మంజూరు చేసి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా కొత్త భవనం పునాదులకే పరిమితమైంది. పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది ఆందోళనలతో ఆ తర్వాత రూ.కోటి చెల్లించారు. దీనితో భవన నిర్మాణం మొదటి అంతస్తు వరకు జరిగి ఆగిపోయింది. ప్రధానమైన ఈ గ్రంథాలయానికి అన్ని వయసుల వారు వస్తుంటారు. ముఖ్యంగా వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు 50మందికిపైగా చదువుకుంటూ ఉంటారు. అయితే శిథిల భవనం వల్ల వారు ఏకాగ్రతగా చదువుకోలేని పరిస్థితి నెలకొంది. ఇదికాక జిల్లాలోని కొన్ని శాఖా గ్రంథాలయాల భవనాలు కూడా దెబ్బతిన్నాయి. వాటికీ మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది.

పాలక మండలిని పట్టించుకోరే?

గత వైసీపీ ప్రభుత్వంలో జిల్లా గ్రంథాలయ సంస్థకు చైర్మన్ తప్ప కమిటీని నియమించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చినా ఇప్పటి వరకు పాలక మండలి నియామకంపై దృష్టిపెట్ట లేదు. ఈ పరిణామం అభివృద్ధి పనులకు ఆటంకంగా మారింది. జిల్లాలోని గ్రంథాలయాలకు 2020 - 2021 సంవత్సరంలో కంప్యూటర్లు కొనుగోలు చేశారు. కానీ వాటిని పూర్తిస్థాయిలో వినియోగించడంలేదు.

పన్నులు చెల్లిస్తేగా..

గ్రంథాలయాలకు ప్రధాన ఆర్థిక వనరు స్థానిక సంస్థలు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలకు ప్రజలు చెల్లించే ఇంటి పన్నుల్లో 2 శాతం గ్రంథాలయ సెస్సుగా వసూలు చేస్తారు. ఆ మొత్తాన్ని గ్రంథాలయ సంస్థకు జమ చేయాల్సి ఉంటుంది. అయితే ఈ ప్రక్రియ ఎప్పటికప్పుడు జరగకపోవడంతో గ్రంథాలయాల అభివృద్ధికి, సిబ్బంది జీతాలు, పింఛన్ల చెల్లింపునకు నిధుల కొరత తీవ్రంగా ఉంది. సెస్సు బకాయిలు కోసం గ్రంథాలయ సంస్థ రిటైర్డ్ ఉద్యోగులు, మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. జాయింట్ కలెక్టర్, జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశాల్లో గ్రంథాలయ సెస్సులు చెల్లించాలని ఆదేశించినా నెల్లూరు నగర పాలక సంస్థ, మున్సిపాలిటీలు బేఖాతరు చేస్తూనే ఉన్నాయి. ఆ నిధులు గ్రంథాలయ సంస్థకు ఎప్పుడు చేరుతాయో చెప్పలేని పరిస్థితి నెలకొంది.

ఉమ్మడి జిల్లాలో సెస్సు బకాయిలు ఇలా..

మున్సిపల్	బకాయిలు (రూ.లలో)
నెల్లూరు	34,27,26,407
కావలి	1,19,46,383
గూడూరు	87,62,092
ఆత్మకూరు	50,27,005
వెంకటగిరి	45,86,000
నాయుడుపేట	44,96,978
బుచ్చిరెడ్డిపాలెం	11,12,091
అల్లూరు	2,43,000
మొత్తం	40.05.96.347



వారసత్వ సంపదగా జిల్లా కేంద్ర గ్రంథాలయం

నెల్లూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనానికి 100 సంవత్సరాలకు పైగా చరిత్ర ఉండడంతో దానిని వారసత్వ సంపదగా పరిగణించాలని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ తెలిపారు. ఆయన ఈనెల 10వతేదీన జిల్లా గ్రంథాలయ సంస్థను సందర్శించారు. భవన మరమ్మతులకు నిధులిస్తామని హామీ ఇచ్చారు. గ్రంథాలయ సంస్థ కొత్త భవనం పూర్తయ్యాక ప్రస్తుత భవనాన్ని వారసత్వ సంపదగా పురావస్తు శాఖకు అప్పగిస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో పాత భవనం మరమ్మతు పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.



అసంపూర్తిగా ఉన్న గ్రంథాలయ సంస్థ భవనం

లంచం అడిగితే ఇంటికే..!

● నెల్లూరు ఆర్డీవో నాగ సంతోష్ అనూష

నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్నీ మండలాలతో పాటు ఆర్డీవో కార్యాలయంలో ప్రజలకు సేవలు అందించేందుకు లంచాలు అడిగితే సహించనని, అలాంటి వారిని ఇంటికి పంపిస్తానని నెల్లూరు ఆర్డీవో నాగ సంతోష్ అనూష హెచ్చరించారు. శుక్రవారం ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ప్రధానంగా లాండ్ కన్వర్షన్, టపాసుల లైసెన్సు విభాగాల్లో పనులు చేయడానికి కొందరు ఉద్యోగులు లంచా లు అడుతున్నారని తన దృష్టికి వచ్చిందని చెప్పారు. ఇకపై ఇలాంటి కొనసాగితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. తాను స్వయంగా పర్యవేక్షించిన తరువాత మాత్రమే అనుమతులు ఇస్తామన్నారు. టపాసుల లైసెన్సుల జారీ సైతం అంతా పారద ర్శకంగా తన పర్యవేక్షణలో నిర్వహి స్తామ న్నారు. ఎవరైనా నగదు అడిగితే తనకు నేరుగా వచ్చి ఫిర్యాదు చేయవచ్చని ప్రజలకు తెలిపారు.


సాగులో ఉన్న ఖర్జూరం తోట, ఖర్జూరం గెలలు

ప్రయోగం ఫలించింది..

ఫలం చేతికందింది!

విజయం

- కరవు ప్రాంతం.. ఖర్జూరానికి అనుకూలం
- ఐదున్నర ఎకరాలలో పది చెట్ల సాగు
- నాలుగేళ్ల తర్వాత ఫలసాయం
- కిలో రూ.150 వంతున విక్రయం
- ప్రభుత్వం ప్రోత్సహించాలంటున్న రాఘవులు

రూ.లక్షలకు లక్షలు పెట్టుబడి పెట్టి సాగుచేస్తే ఫలితం ఎలా ఉంటుందో తెలియదు.. అన్నీ అనుకున్నట్లే జరిగినా ఫలసాయం అందాలంటే కనీసం నాలుగేళ్లు ఎదురు చూడాలని ఉద్యాన అధికారులు సైతం నిరుత్సాహ పరిచారు. కానీ పుడమితల్లినే నమ్ముకున్న ఆ రైతు మాత్రం అడుగు ముందుకు వేశాడు. తనకున్న ఐదున్నర ఎకరాలలో పూర్తిగా ఖర్జూర మొక్కలు నాటాడు. నాలుగేళ్లు వాటిని కంటికి రెప్పలా కాపాడిన ఆ రైతు ఈ ఏడాది తొలికాపు 30 కిలోల ఖర్జూర పండ్లను దించి, విక్రయించాడు. ఈ పండ్లు తిన్నవారు.. తోటను వీక్షించిన వారు 'శభాష్ రాఘవులు..' అంటూ పొగడ్తలతో ముంచెత్తుతున్నారు.

కందుకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఖర్జూరం.. ఈ పేరు వింటే చాలు చిన్నపిల్లల మొదలు అవ్వా తాతల వరకు నోరూరక మానదు. ఒకప్పుడు ఎక్కడో అరబ్ దేశాల నుంచి దిగుమతి అయ్యే ఖర్జూరాన్ని కొని తినడం అం టే సామాన్యులకు ఓ కలగా ఉండేది. ఇరాన్, ఇరాక్, సౌదీ, దుబాయ్‌ల నుంచి దిగుమతి చేసుకోవడం మినహా మరో ప్రత్యామ్నాయం లేని ఖర్జూరను జిల్లాలోని వలేటివారిపాలెం మండలం అత్తంటివారిపాలెంలో కంచర్ల రాఘవులు వినూత్నంగా సాగుచేసి విజయం సాధించారు. నాలుగేళ్ల క్రితం గుజరాత్ నుంచి ఒక్కో మొక్క రూ.3600 వంతున పది మొక్కలు కొనుగోలు చేసి తన ఐదున్నర ఎకరాలలో నాటాడు. మొక్కల కొనుగోలు, నీటివసతి కోసం బోర్ల ఏర్పాటు, ఇతరత్రా నిర్వహణ ఖర్చుల కోసం తొలి సంవత్సరమే ఆయనకు 25 లక్షలకు పైగా ఖర్చు అయ్యింది. ఖర్జూరం తోట వేసిన పొలం చుట్టూ రక్షణ కవచంగా వాక్కాయ మొక్కలు కూడా నాటాడు. సహజ సిద్ధంగా ముళ్లకంపవలే పెరిగే వాక్కాయ తోటలోకి పశువులు, ఇతరత్రా జీవాలు ప్రవేశించే అవకాశం లేకుండా పెరగడమే గాక ప్రస్తుతం ఏడాదికి రెండు సీజన్లలో కాపు వస్తోంది. వాక్కాయ (చెర్రీ)కు కూడా ప్రస్తుతం మార్కెట్లో గిరాకీ ఉండటంతో ఖర్జూరంతో పాటు రక్షణకు వేసిన వాక్కాయ చెట్లు కూడా రాఘవులుకు ఆదా యాన్ని తెచ్చి పెడుతున్నాయి. మార్చి, ఏప్రిల్ మాసాలలో ఖర్జూరం గెలలు వస్తాయని జూలై, ఆగస్టు నెలల్లో కోతకు వస్తాయని అడపా దడపా సెప్టెంబరు నెలాఖరు వరకు కూడా కాయలు తోటలో ఉంటా యని రాఘవులు చెబుతున్నారు. ఈ ఏడాది కొద్ది చెట్లు మాత్రమే కాపునకు రాగా కిలో 150 రూపాయల వంతున స్థానికులే పోటీపడి కొనుగోలు చేశారని చెప్పారు. దిగుమతి చేసుకునే ఖర్జూరాలతో పోలి స్తే ఇవి ఎంతో రుచిగా ఉండటమేగాక సహజసిద్ధమైనవి కావటంతో కొనుగోలుకు పోటీ ఎక్కువైందని చెబుతున్న రాఘవులు వచ్చే సంవ త్సరం ఎక్కువశాతం ఖర్జూర చెట్లు కాపునకు వస్తాయని దిగుబడి కూడా గణనీయంగా పెరుగుతుందని ఆశిస్తు న్నారు.


తోటకు రక్షణ కంచెగా వాక్కాయ చెట్లు

ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం

ఖర్జూర సాగుకు ఈ ప్రాంతం అనుకూలమని తేలినందున ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే సాగువిస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. నేను ఖర్జూరం సాగు చేయదలచినప్పుడు ఉద్యాన శాఖ అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయింది. ప్రభుత్వం నిర్ధేశించిన ఉద్యాన పంటలలో ఖర్జూరం లేనందున ఏమీ చేయలేమని అధికారులు నిస్సహాయతను వ్యక్తం చేశారు. దీంతో చేసేదిలేక రూ.లక్షలు ఖర్చుపెట్టి సాగుచేశా. ఈ ఏడాది మా తోటలో కొన్ని చెట్లకు కాపురావటం, మంచి ధరకు కాయలు అమ్మడంతో ఇప్పుడు చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా మా తోట చూసివెళ్లటానికి రైతులు వస్తున్నారు. ప్రస్తుతం ఖర్జూరం మొక్క కొనాలంటే రూ.4200 చెబుతున్నారు. ఈ స్థితిలో ఉద్యాన శాఖ ద్వారా నాణ్యమైన మొక్కలను తక్కువ ధరకు సరఫరా చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.



\- కంచర్ల రాఘవులు

అధికారం ఉంది కదా అని

అడ్డగోలుగా దోచి పెట్టారు!

- పొదలకూరులో ప్రభుత్వ భూముల ధారాదత్తం
- అధికారమే అండగా దోచుకున్న వైసీపీ నేతలు
- అడిగిందే తడువుగా కట్టబెట్టిన రెవెన్యూ సిబ్బంది
- అంతా తానై నడిపించిన ఓ తహసీల్దారు
- విచారణలో తేలిన నిజాలు.. చర్యలకు రంగం సిద్ధం

నెల్లూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం చివరి ఏడాది కాలంలో పొదలకూరు మండలంలో అనేక భూ అక్రమాలు జరిగాయి. అప్పట్లో పనిచేసిన ఓ తహసీల్దార్ వైసీపీ నాయకులు అడిగిందే తడువుగా నిబంధనలు పక్కనపెట్టి దోచిపెట్టారు. అందులో ప్రధానమైది అసైన్‌మెంట్ పట్టాల వ్యవహారం. అర్హులైన పేదలకు భూములు పంపిణీ చేస్తున్నామని నాడు వైసీపీ ప్రభుత్వం ప్రకటించినా ఈ పథకం వైసీపీ నేతలకు ఒక వరంగా మారింది. భూస్వాములు కూడా పేదల అవతారమెత్తి ప్రభుత్వ భూములను కొల్లగొట్టారు. పొదలకూరు మండలంలో అసలు పేదలే లేనట్లుగా వెంకటాచలం, తిరుపతి జిల్లా కోట వంటి మండలాల్లోని వైసీపీ నేతలకు కూడా అసైన్‌మెంట్ పట్టాలు పంపిణీ చేసినట్లు అధికారుల విచారణలో తేలింది. ఇక కొంతమందికైతే అసలు అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం లేకుండానే పట్టాలు కూడా పంపిణీ చేయడం గమనార్హం. రాష్ట్రమంతా ఒక ఫార్మాట్లో అసైన్‌మెంట్ పట్టాలు తయారు చేస్తే ఒక్క పొదలకూరు మండలంలో మాత్రం మరో రకమైన ఫార్మాట్‌లో పట్టాలు రూపొందించారు. ఈ పట్టాలను చూసి జాయింట్ కలెక్టర్ కూడా ఆశ్చర్యపోయినట్లు సమాచారం. ఆరోపణలు ఎదుర్కొంటున్న తహసీల్దార్‌నే ఈ పట్టాలను రూపొందించినట్లు చెప్పుకుంటున్నారు. ఇదంతా అధికారుల విచారణలో బట్టబయలైంది. ఇక పోరంబోకు భూములను కూడా అసైన్‌మెంట్ మాటున వైసీపీ నేతలకు దోచిపెట్టినట్లు తెలుస్తోంది. ఓ గ్రామంలో పోరంబోకు భూములను ఏకంగా ఓ మైనింగ్ కంపెనీ పేరు మీదకు మార్చేయడం గమనార్హం. అలానే ఫ్రీహోల్డ్ మాటున కూడా భారీగా అక్రమాలు జరిగినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందా యి. గతంలో ఎస్సీ, ఎస్టీలకు పంపిణీ చేసిన భూములను వైసీపీ నేతలు కొనుగోలు చేసి, ఫ్రీహోల్డ్ మాటున వాటిని వారి పేర్లపైకి ఎక్కించుకోవడంతో పాటు నిషేధిత జాబితా నుంచి తొలగించినట్లు ఫిర్యాదుల్లో ఉంది. ఇటువంటి అక్రమ వ్యవహారాలు కూడా అధికారులు విచారణలో బయటపడుతున్నాయి. ఇప్పటికే అందిన ఫిర్యాదులపై ఆర్డీవో విచారణ పూర్తి చేయగా, ఆ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకునేందుకు కలెక్టర్, జేసీ సిద్ధమవుతున్నారు.

● అప్పుడు.. ఇప్పుడు అక్కడే..!

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదట్లో పొదలకూరు తహసీల్దార్‌గా సచివాలయం నుంచి ట్రైనీగా వచ్చిన స్వాతి పని చేశారు. ఆ సమయంలో అనేక భూ అక్రమాలు జరిగాయి. అప్పట్లో ప్రభుత్వ భూముల మ్యుటేషన్, క్లాసిఫికేషన్ మార్చే లాగిన్ తహసీల్దార్లకే ఉండడంతో విచ్చలవిడిగా అక్రమాలు చోటుచేసుకున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా రికార్డులు మార్చిన కేసులు వందల్లో ఉన్నట్లు నాడు ఫిర్యాదులు అందాయి. ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తుల పేర్లపైకి ఎక్కించడమే కాకుండా పట్టా భూములను కూడా ఇష్టానుసారంగా మ్యుటేషన్లు చేశారు. స్వాతి హయాంలో జరిగిన మ్యుటేషన్‌లపై విచారణ చేసేందుకు రెండు గ్రామాలకు ఒక తహసీల్దార్ చొప్పున ఏకంగా ఎనిమిది తహసీల్దార్లను పొదలకూరు మండలంలో విచారణకు దించారంటే అక్కడ ఏం జరిగిందో అర్థం చేసుకోవచ్చు. ఈ విచారణలో అక్రమాలు తేలడంతో అప్పటి తహసీల్దార్ స్వాతిని ప్రభుత్వం సస్పెండ్ చేసింది. అయితే ఆ తర్వాత కూడా పొదలకూరు మండలంలో రెవెన్యూ వ్యవస్థ పాఠాలు నేర్వలేదు. మళ్లీ అదే అక్రమ బాటలో పయ నించారు. ఇష్టానుసారంగా ప్రభుత్వ భూములను దోచిపెట్టారు. ఈదఫా కూడా పొదలకూరులో భూఅక్రమాలపై ఉన్నత స్థాయి విచారణ జరగ్గా, ఇప్పుడు కూడా అక్రమాలు జరిగినట్లు విచారణలో తేలడం గమనార్హం. ఇది అప్పట్లో మంత్రిగా పనిచేసిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి సొంత మండలం కావడం కొసమెరుపు.



చార్జెస్ ఫ్రేమ్ చేస్తున్నాం

పొదలకూరు మండలంలో భూ అక్రమాలు జరిగాయన్న ఫిర్యాదులపై విచారణ పూర్తి చేశాం. కొన్ని అవకతవకలు జరిగినట్లు తేలింది. అనర్హులకు అసైన్‌మెంట్ పట్టాలు ఇవ్వడం, అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం లేకుండానే ఇంకొందరికి పట్టాలు పంపిణీ చేయడం, పోరంబోకు భూములను మైనింగ్ కంపెనీ పేరు మీదకు మార్చడం వంటి పలు విషయాలు విచారణలో తేలాయి. ఇందుకు సంబంధించి బాధ్యులైన నాటి తహసీల్దార్, రెవెన్యూ సిబ్బందిపై చార్జెస్ ఫ్రేమ్ చేస్తున్నాం. నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం.

\- కే కార్తీక్, జాయింట్ కలెక్టర్

21న విశ్రాంత ఉద్యోగుల సమావేశం

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : విశ్రాంత ఉద్యోగుల సంఘం సమావేశాన్ని ఈనెల 21వ తేదీ నిర్వహిస్తున్నామని ఏపీస్టేట్ గవర్నమెంటు రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఐ లక్ష్మీనారాయణ, కార్యదర్శి పీ వెంకయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 5 గంటలకు టౌన్‌హాల్లో జరిగే ఈ సమావేశానికి తాలూకా అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గసభ్యులు హాజరు కావాలని కోరారు.

ఓపెన్‌స్కూల్ రిజిస్ట్రేషన్ గడువు పొడిగింపు

నెల్లూరు (విద్య), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఓపెన్‌స్కూల్ ప్రవేశాలకు ఈనెల 31వతేదీ వరకు గడువు పొడిగిస్తున్నట్లు డీఈవో రామారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు ఈనెల 25వతేదీ వరకు ఎలాంటి అదనపు చెల్లింపులు లేకుండా ప్రవేశాలు పొందవచ్చన్నారు. అనంతరం 29వతేదీ వరకు రూ.200, ఈనెల 30, 31వతేదీల్లో రూ.500 అదనపు రుసుమును చెల్లించి అడ్మిషన్ పొందాలన్నారు. వ్యక్తిగతంగాగానీ, ఏపీ ఆన్‌లైన్ కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా గానీ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు apopenschoo.ap.gov.in వెబ్‌సైట్‌కానీ, సమీపంలోని అధ్యయన కేంద్రాల్లో కానీ, 9000619699 నెంబరను కానీ సంప్రదించాలని కోరారు.

క్షయ నిర్మూలనే లక్ష్యంగా పని చేయాలి

● అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి


వెంకటాచలం : మాట్లాడుతున్న అదనపు డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి

మనుబోలు/వెంకటాచలం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): వైద్యసిబ్బంది 2029 నాటికి క్షయనిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాదరవలి ఆదేశించారు. శుక్రవారం ఆయన మునుబోలు, వెంకటాచలం మండలంలోని కసుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందితో వైద్యసేవలపై సమీక్షించారు. బీసీజీ వ్యాక్సినేషన్, క్షయవ్యాధిగ్రస్తులకు అందించే చికిత్స, గర్భిణులు, పిల్లలకు ఇచ్చే వ్యాధినిరోధక టీకాలపై చర్చించారు. క్రమం తప్పకుండా ప్రతి బుధ, శనివారాల్లో వ్యాక్సిన్ కచ్చితంగా వేయాలని సూచించారు. ప్రతి సచివాలయానికి క్లోరిన్ టాబ్లెట్స్ సరఫరా చేశామని, వాటిని మంచినీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేసిన నీటిని వదిలేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో వైద్యాధికారులు డాక్టర్ గేయపూజిత, డాక్టర్ కీర్తిప్రియా, సీహెచ్‌వోలు రాజయ్య, రామసుబ్బారెడ్డి, సూపర్‌వైజర్లు రమణయ్య, వెంకటేశ్వర్లు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



చినుకురాలితే చిత్తడే!

సోమశిల జలాశయం వద్ద సోమేశ్వరుడి ఆలయం ముందున్న రోడ్డు ఇది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డంతా చిత్తడిగా మారిపోయింది. అంతకుముందు గుంతలమయంగా ఉన్న రోడ్డుపై ఇటీవల కంకర మిశ్రమాన్ని చల్లారు. ప్రస్తుత వర్షాలకు రోడ్డంతా చిత్తడిగా మారి వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.

\- అనంతసాగరం (ఆంధ్రజ్యోతి)

- వైసీపీ సర్కారులో మొక్కుబడిగా క్రీడల నిర్వహణ
- మొండిగోడలు దాటని కేవీకేల నిర్మాణం
- మొగళ్లపాళెం క్రీడాగ్రామానికి గ్రహణం
- నేడు నెల్లూరులో శాప్ చైర్మన్ పర్యటన



క్రీడల్‌కు బూస్ట్ ఇవ్వండి!

నెల్లూరు (విద్య), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో డీఎస్‌ఏకు సంబంధించిన ఇండోర్ లేదా అవుట్‌డోర్ స్టేడియాల్లో అడుగు పెట్టాలన్నా, ఆటలాడాలన్నా నగదు ఖచ్చితంగా చెల్లించాలంటూ రాష్ట్ర క్రీడాపాధికార సంస్థ (శాప్) ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. గత వైసీపీ ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నెం 20తో ఇబ్బందిగా మారింది. 14 ఏళ్లలోపు క్రీడాకారులకు ఒక రేటు, 14 ఏళ్లు పైబడిన వారికి ఒక రేటు నిర్ణయించి ఆయా ధరల పట్టికను డీఎస్‌ఏకు పంపించారు. ప్రభుత్వం మారినా నేటికీ ఈ జీఓ కొనసాగుతుండటంతో క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు.

● క్రీడా గ్రామానికి గ్రహణం

రాష్ట్రంలో 2019లో జాతీయ క్రీడల నిర్వహణే లక్ష్యంగా నెల్లూరు రూరల్ మండలంలోని మొగళ్లపాళెంలో 2014లో క్రీడా గ్రామం కోసం 150 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో డీపీఆర్(డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) రూపొందించి పంపాలని నాటి కేంద్రమంత్రి ఎం.వెంకయ్యనాయుడు అప్పటి రాష్ట్ర సర్కారును కోరారు. 2016లో 150 ఎకరాలు శాప్ ఆధ్వర్యంలోకి వచ్చింది. శాప్ ప్రతిపాదనలకు వెంకయ్యనాయుడు ప్రత్యేక చొరవ చూపి నాటి కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖను ఒప్పించారు. రాష్ట్ర సర్కారు ఇందుకోసం శాప్ ద్వారా ప్రహరీగోడ, విద్యుత్, రోడ్లు, నీటి సౌకర్యం కల్పించేందుకు రూ.4.60 కోట్లు విడుదల చేసింది. సకాలంలో డీపీఆర్ రూపొందించి కేంద్ర సర్కా రుకు పంపితే క్రీడాగ్రామం కోసం రూ.200 కోట్లతో అంతర్జాతీయ క్రీడా ప్రమాణాల కలిగిన క్రీడాప్రాంగణాలు రూపుదిద్దుకునే అవకాశం ఉందని వెంకయ్యనాయుడు సూచనలు చేసినా ప్రభుత్వం తగిన ప్రాధాన్యత చూపలేకపోయింది. 2016లో రాష్ట్ర ప్రభుత్వం రూ.6 కోట్లు విడుదల చేయగా, ఈ నిధులను భూ సేకరణలో భాగంగా రైతులకు చెల్లించి భూమిని స్వాధీనం చేసుకుంది. అయితే ఇప్పటికీ వీటి నిర్మాణాలు నత్తనడకన సాగుతోంది. తొలిదశలో రూ.8కోట్లతో మల్టీ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించేందుకు 2017 మార్చిలో భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ పనులను 2022లో పూర్తి చేసి 2023లో డీఎస్‌ఏకు అప్పగించారు. అప్పటి నుంచి ఈ ఇండోర్ స్టేడియం ప్రారంభానికి ఎదురుచూస్తోంది. ఈ పరిస్థితుల్లో నూతనంగా నియమితులైన శాప్ చైర్మన్ రవికుమార్ శనివారం జిల్లా పర్యటనకు వస్తున్నారు. ఉదయం మొగళ్లపాళెం మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలోని డీఎస్‌ఏ కార్యాలయాన్ని ఆయన సందర్శించనున్నారు. రవికుమార్ పర్యటనతోనైనా జిల్లాలో క్రీడారంగానికి పూర్వవైభవం వచ్చేనా అని క్రీడాకారులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

● కలగానే క్రీడా వికాస కేంద్రాలు

అధికారుల పర్యవేక్షణ లోపం.. ఇంజనీరింగ్ అధికారుల ఉదాసీనతతో జిల్లాలో నిర్మించాల్సిన క్రీడా వికాస కేంద్రాల (కేవీకే) నిర్మాణాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సహించి వారిని జాతీయస్థాయిలో ఆడేలా తయారు చేయాలనే లక్ష్యంతో ఏర్పాటు చేయనున్న కేవీకేలు కలగానే మిగిలిపోయాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో నియోజకవర్గానికి ఒక్కో కేవీకే చొప్పున తొలివిడతగా నాలుగు మంజూరైనా వాటి ఊసే లేకుండా పోయింది. మిగిలిన ఆరు కేంద్రాల గురించి అసలు పట్టించుకునే నాథుడే లేడు. ఒక్కో స్టేడియం నిర్మాణానికి రూ.2కోట్లు కేటాయించినా ఒకటి కూడా పూర్తి కాలేదు.

● పూర్వవైభవం వచ్చేనా...?

గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం క్రీడలను పూర్తిగా నిర్వీర్యం చేయడంతో ఔత్సాహిక క్రీడాకారులు, ప్రతిభ కలిగిన వారు క్రీడలకు దూరమైపోయారు. ఈ నేపథ్యంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో క్రీడలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించి పూర్వవైభవం తీసుకురాకపోతుందా అని క్రీడాకారులు ఎదురు చూస్తున్నారు.

మాట్లాడుతున్న వీరంపల్లి పొదుపు మహిళలు



స్త్రీనిధి, ఉన్నతి డబ్బు స్వాహాపై ఫిర్యాదు

- బ్యాంకు నోటీసులతో బయటపడ్డ వైనం
- పోలీసుల ముందు లబోదిబోమన్న పొదుపు మహిళలు

మనుబోలు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): తమ గ్రామానికి చెందిన వీవోఏ భారతి తాము చెల్లించిన స్త్రీనిధి, ఉన్నతి పథకాల డబ్బులను స్వాహా చేసిందంటూ వీరంపల్లి పొదుపు మహిళలు శుక్రవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలో సుమారుగా 42 పొదుపు సంఘాలు ఉన్నాయన్నారు. 2020నుంచి కొన్ని సంఘాల సభ్యులు స్త్రీనిధి, ఉన్నతి పథకాల ద్వారా రుణాలను బ్యాంకుల ద్వారా తెచ్చుకున్నామన్నారు. ప్రతినెలా వాయిదాలను వీవోఏ భారతికి ఇచ్చి రసీదులు తీసుకున్నామన్నారు. అయితే గూడూరు సిండికేట్ బ్యాంకు అధికారులు రుణాలు చెల్లించలేదని, రూ.20 వేలు బకాయిలు ఉన్నాయంటూ గురువారం గ్రామంలోని దాదాపు 80మంది పొదుపు మహిళలకు నోటీసులు ఇచ్చారన్నారు. దీంతో అందరూ అవాక్కయ్యమన్నారు. దీనిపై వీవోఏని ప్రశ్నించగా తనకేమి సంబంధం లేదని, ఎవరికైనా చెప్పుకోండంటూ బదులు చెప్పిందని వాపోయారు. ఎలాగైనా తమకు న్యాయం చేయాలంటూ పొదుపు మహిళలు పోలీసుల ఎదుట లబోదిబోమన్నా రు. వీవోఏని విచారించి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మహిళలకు హామీ ఇచ్చారు.

అలరించిన అష్టావధానం

● ముగిసిన హనుమజ్జానకీ రామశర్మ శత జయంతి సభ


అష్టావధానంలో సాహితీకారులు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పోలూరి హనుమజ్జానకీ రామశర్మ శత జయంతి ముగింపు సమావేశం శుక్ర వారం నెల్లూరు టౌనుహాలులో జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన అష్టావ ధానం అలరించింది. ఈ కార్యక్రమాన్ని పద్య కళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్, కోశాధికారి నలబోలు బలరామయ్యనాయుడు, నిర్వాహకులు వేదం వెంకటరాధాకృష్ణ ప్రారంభించారు. డాక్టర్ సూరం శ్రీనివాసులు అధ్యక్షతన కొండేపి మురళీకృష్ణ అష్టావధానం నిర్వహించారు. సమస్యను డాక్టర్ ఎస్ఎస్ఆర్‌కే ప్రసాదరావు, దత్తపది డాక్టర్ కే గిరిజాలక్ష్మి, న్యస్తాక్షరీ సూరం అరుణ, వర్ణన సీహెచ్ వీ బృందావనరావు, నిషిద్ధాక్షరిగా అగస్త్య రాజు సుబ్బారావు, అశువుగా పోలవరం లక్ష్మీనరసింహారావు, ఛందోభాషణాన్ని డాక్టర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, అప్రస్తుత ప్రసంగంతో బత్తిన సాయికుమార్‌రెడ్డి అవధానాన్ని రక్తి కట్టించారు. ఈ కార్యక్రమంలో పోలూరి హనుమజ్జానకీ రామశర్మ రచించిన శ్రీరామపట్టాభిషేకం పుస్తకాలను వితరణ చేశారు. పలువురు సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

సోమశిల.. జలకళ

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయంలో నీటిమట్టం పెరుగుతోంది. ఎగువ నుంచి భారీగా వరద వచ్చి చేరుతోంది. శుక్రవారం 33,891 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు అధికారులు తెలిపారు. డ్యాంలో 57.036 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 50, కండలేరుకు 10,000, ఉత్తర కాలువకు 40 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

● రాళ్లపాడులో..

లింగసముద్రం (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టులో నీటిమట్టం 14.6 అడుగులకు చేరింది. ప్రస్తుతం ఇన్‌ఫ్లో కేవలం 190 కూసెక్కులు మాత్రమే ఉంది. ఈ వర్షాలకు ముందు ప్రాజెక్టులో 8.7 అడుగుల నీటి మట్టం ఉం డగా, వరద రాక మొదలవడంతో నీటినిల్వ పెరుగుతూ వచ్చింది. అయితే, మరో 2 అడు గుల నీరు చేరితే వరి సాగుకు అనుకూలంగా ఉంటుందని రైతులు అంటున్నారు. వాస్తవానికి ప్రాజెక్టు సామర్థ్యం 20 అడు గులు ఉన్నా 21.6 అడుగుల మేర నిల్వ చేసుకునే అవకాశం ఉంది. అయితే ప్రాజెక్టు భద్రత దృష్ట్యా అధికారులు 20 అడుగుల నీరు మాత్రమే నిల్వ చేస్తున్నారు.

● నీటి విడుదలకు సన్నాహాలు

సంగం (ఆంధ్రజ్యోతి): సంగం బ్యారేజీ నుంచి నీటి విడుదలకు ఇరిగేషన్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వర్షాలు తగ్గడంతో కాలువలకు, చెరువులకు క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి వరద రావడం ఆగిపోయింది. దీంతో పెన్నానదికి వస్తున్న వరదతో బ్యారేజీ వద్ద నీటి మట్టం పెంచేందుకు శుక్రవారం ఎత్తిన గేట్లను మూసేశారు. ప్రస్తుతం బ్యారేజ్ వద్ద 10 అడుగుల నీటిమట్టం ఉంది. ఎగువ నుంచి బ్యారేజీకి సుమారు 6 వేల క్యూసెక్కుల నీరు వస్తోంది. కనిగిరి రిజర్వాయర్‌కు, బీపీఆర్, కనుపూరు, నెల్లూరు చెరువు కాలువలకు నీటిని విడుదల చేసేందుకు చర్యలు చేపట్టారు. నీటిమట్టం పెరగ్గానే నీటిని విడుదల చేస్తామని ఏఈ వినయ్ కుమార్ తెలిపారు.

బస్తాల్లో రికార్డులు భద్రమేనా?

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏపీలో అనేక చోట్ల ప్రభుత్వ కార్యాలయాల్లో రికార్డులు మాయమవుతు న్నాయి. కొన్ని చోట్ల రికార్డు గదుల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ క్రమంలోనే నెల్లూరు కార్పొరేషన్‌లోనూ ముఖ్యమైన రికార్డులు ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. ఇంజనీరింగ్ విభాగంలో వందల కోట్ల పనులకు సంబంధించిన ఎంబుక్కులు, సిటీప్లానింగ్‌లోని భవనాల అనుమతుల ఫైళ్లు, ఆస్తి పన్నులకు సంబంధించి పత్రాలను బస్తాల్లో మూటకట్టారు. వీటిని రికార్డు గదిలో భద్రంగా ఉంచాల్సిన అధికారులు కార్యాలయం రెండవ అంతస్తులో బయటపడేశారు. అక్కడ ఎవరూ కాపాలా కూడా లేరు. ఈ బస్తాలను ఎవరైనా అపహరించినా, అగ్గి అంటుకున్నా ఇక



ఆ పత్రాలు తిరిగిరానట్టే!. కార్పొరేషన్ అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంపై కమిషనర్ జోక్యం చేసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

- నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి)

రోడ్ క్లీనింగ్ యంత్రాలు వచ్చేశాయ్!



నెల్లూరులోని ప్రధాన రహదారులను శుభ్రం చేసేందుకు భారీ వాహనాలు నగరానికి చేరుకున్నా యి. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసిన ఈ వాహ నాల్లో నాలుగింటిని నెల్లూరుకు కేటాయించారు. అవి శుక్రవారం ఎన్‌ఎంసీకి చేరాయి. ఈ యంత్రాలు రోడ్డుపై పేరుకు పోయిన మట్టిని పూర్తిగా తొలగిస్తాయని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఇలాంటివి మూడు వాహనాలు నెల్లూరులో పని చేయగా, వైసీపీ అధికారులోకి వచ్చాక వాటిని మూలనపడేసింది. రాష్ట్రంలో మళ్లీ కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో క్లీనింగ్ యంత్రాలపై దృష్టిపెట్టారు. రోడ్లపై కాగితాలు, కవర్లను గాలి ద్వారా పీల్చుకునే జటాయి వాహనాలు కూడా నెల్లూరుకు చేరాయి.

- నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి)

చెత్త 'బండెనక బండి'



నెల్లూరులోని అల్లీపురం వద్ద చెత్త వాహనాల రద్దీ నెలకొంటోంది. నెల్లూరు - కోడూరు రహదారి వెంబడి పెట్రోల్ బంకు వద్ద కార్పొరేషన్ డంపింగ్ యార్డు ఉంది. నగరంలో సేకరించిన చెత్తను మినీ ఆటోలు, ట్రాక్టర్లలో తీసుకువచ్చి ఇక్కడ గుట్టలుగా పోస్తున్నారు. ఇలా వచ్చిన వాహనాలు ఇటు నవాబుపేట రోడ్డు, అటు జాతీయరహదారి పై బారులుతీరుతున్నాయి. దీని వల్ల నెల్లూరు నుంచి అల్లీపురం, పెద్దచెరుకూరు, నరుకూరు, కోడూరు ప్రాంతాలకు రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గంటల తరబడి చెత్త వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది.

- నెల్లూరు రూరల్ (ఆంధ్రజ్యోతి)

రైతులను పూర్తి స్థాయిలో ఆదుకుంటాం

- కలెక్టర్ ఆనంద్ వెల్లడి
- నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే భూసేకరణ పనుల పరిశీలిన



పొదలకూరు: రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

ఆత్మకూరు, చేజర్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : నడికుడి-కాళహస్తి రైల్వే లైను నిర్మాణ పనులకు సంబంధించి భూసేకరణలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకుంటామని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ తెలిపారు. శుక్రవారం ఆయన ఆత్మకూరు మండలంలోని అప్పారావుపాళెం, చేజర్ల మండలంలోని పెరుమాళ్లపాడు గ్రామాల్లో పర్యటించి రైల్వే లైనుకు సంబంధించి భూయజమానులు, రైతులతో మాట్లాడారు. అప్పారావుపాళెం రైతులు మాట్లాడుతూ కేవలం ఒక కిలోమీటరు పరిధిలో పిల్లర్లు వేసి రైల్వే లైను నిర్మిస్తే తమ గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు వరద సమయంలో ఇబ్బం దులు లేకుండా ఉంటాయని వివరించారు. మాగాణి భూములను మెట్ట భూములుగా రికా ర్డుల్లో చూపించినందున సరైన నష్టపరిహారం అందక తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుమాళ్లపాడు గ్రామ రైతులు మాట్లాడుతూ చిన్న కమతాలు ఉన్నటు వంటి రైతులందరికీ మేలు చేకూర్చే విధంగా నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఈమేరకు ఆయన వారి వద్ద నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టరు ఆనంద్ మాట్లాడుతూ నడికుడి రైల్వేలైను భూసేకరణలో రైతులకు చెల్లింపులు చేయడానికి గల ఇబ్బందులను నేరుగా రైతుల నుంచి తెలుసుకోడానికే వచ్చామన్నారు. రైతుల అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని తెలిపారు. అదేక్రమంలో భూముల టైటిల్ విషయమై తగాదాలు ఉన్నటు వంటి కేసుల్లో అథారిటీ నిర్ణయించిన మేరకు చెల్లింపులు జరుగుతాయని పేర్కొన్నారు. రిజి స్ట్రేషన్ సమయంలో భూముల ధరలు తక్కువగా చూపడంతో నష్టపరిహారం కూడా తక్కు వగా అందే అవకాశం ఉంటుందన్నారు. రైతులు వెల్లడించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారు నష్టపోకుండా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా, పొదలకూరు మండలం అంకుపల్లి గ్రామంలోనూ కలెక్టర్ పర్యటించి, రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీవో బి పావని, తహసీల్దారు సుధీర్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం వద్దే వద్దు

- కాదని ఏర్పాటు చేస్తే ఉద్యమం
- వెంకటేశ్వరపురంలో మహిళల ఆందోళన
- ఎక్సైజ్ అధికారుల పరిశీలన



ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రం అందిస్తున్న మహిళలు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వెంకటేశ్వరపురంలో విజయ పాల డెయిరీ ముందు ఉన్న దుకాణాల్లో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే ఊరుకొనేది లేదంటూ స్థానిక మహిళలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎక్సైజ్ అధికారు లు శుక్రవారం ఆ దుకాణ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ విషయం తెలిసి మహిళలు కూడా పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఆ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే ఊరుకో నేది లేదని తేల్చి చెప్పారు. చుట్టూ నివా సాలతోపాటు నిత్యం విజయ పాల డెయి రీకి మహిళలు ఉద్యోగానికి వస్తుంటారని, ఇలాంటి ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే ఎలాగని అధికారులను నిలదీశారు. ఈ మేరకు వారికి వినతిపత్రం ఇచ్చారు. ఉన్నతాధికారులను కలవాలని అధికారులు చెప్పడంతో పాల డెయిరీ ప్రాంత మహిళలు పెద్ద ఎత్తున నగరంలోని ఎక్సైజ్ కార్యాలయానికి చేరుకుని డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. తమ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

పోలీసు సిబ్బంది సమస్యలపై ప్రత్యేక దృష్టి

- ఎస్పీ కృష్ణకాంత్



సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ

నెల్లూరు(క్రైం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ జీ కృష్ణకాంత్ డీపీవో కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన చాంబర్‌లో పోలీస్ వెల్ఫేర్ డే నిర్వహించారు. బదిలీలు, ఆరోగ్య సమస్యలు, సస్పెన్షన్ తొలగింపు వంటి 19 సమస్యలను సిబ్బంది ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. వాటికి పరిష్కారం చూపుతామని ఎస్పీ హామీ ఇచ్చారు.

బంగారం దుకాణంలో చోరీకి విఫలయత్నం

- వాహనాల జాకీతో షట్టర్ తీసేందుకు ప్రయత్నించిన దుండగులు

పొదలకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రధాన రహదారిలో ఉన్న ఓ బంగారం దుకాణంలో శుక్రవారం తెల్లవారుజామున దుండగులు చోరీకి ప్రయత్నించారు. వివరాల మేరకు.. ప్రధాన రహదారిలోని సన్నికంటి రాధయ్యకు చెందిన బంగారు దుకాణం వద్దకు గుర్తు తెలియని దుండగులు చేరకుని వాహనాలకు వినియో గించే జాకీ పెట్టి దుకాణం షట్టర్ తీయ్యడానికి విశ్వప్రయత్నాలు చేశారు. దీనిని ఆ దుకాణానికి ఎదురింటి మిద్దెపై నుంచి కొందరు గమనించి కేకలు వేయడంతో జాకీని, గడ్డపారను అక్కడే వదిలేసి దుండగులు పరారయ్యారు. ఈ ఘటనపై దుకాణం యజమానికి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సీఐ రాంబాబు, ఎస్ఐ హనీఫ్‌లు సంఘటన స్థలికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



జాకీతో షట్టర్ తెరిచిన దుండగులు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	140
లేయర్ లైవ్	115
స్కిన్ చికెన్	250
స్కిన్‌లెస్	276
లేయర్	195

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7451
వెండి కిలో ధర	రూ. 95,000
వెండి ఒక గ్రాము	రూ. 98.00

నాటి నిర్లక్ష్యం.. నేడు పాపం!

- సర్వేపల్లి రిజర్వాయర్‌లో అసంపూర్తి పనులు
- వైసీపీ హయాంలో ఆధునికీకరణ పేరుతో మట్టి దోపిడీ
- కొద్దిపాటి వర్షాలకే కోతకు గురవుతున్న కట్ట
- పూర్తిస్థాయిలో నీరు నిల్వ ఉంచలేని దైన్యం

సర్వేపల్లి రిజర్వాయర్ సామర్థ్యం : 1.74 టీఎంసీలు, ఆయకట్టు : 40 వేల ఎకరాలు

పరిధి : వెంకటాచలం, ముత్తుకూరు మండలాలు



సర్వేపల్లి రిజర్వాయర్

వెంకటాచలం, అక్టోబరు 18 : జిల్లాలోని ప్రధాన జలాశయాల్లో సర్వేపల్లి రిజర్వాయర్ ఒకటి. 1.74 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఈ రిజర్వాయర్ నుంచి సుమారు 40 వేల ఎకరాలకు సాగునీరందుతుంది. అయితే, రిజర్వాయర్ కట్ట వరదలు, తుపాన్ల కారణంగా కోతకు గురై పూర్తిగా దెబ్బతినడంతో ఆదునికీకరణకు గత వైసీపీ ప్రభుత్వం రూ.11 కోట్లు మంజూరు చేసింది. కానీ పనులు మాత్రం నత్తనడకన సాగాయి. ఏడాది కిందటే పనులు కూడా అర్ధంతరంగా నిలిచిపోయాయి. 40 శాతం వరకు కట్ట ఆధునికీకరణ పనులు జరిగినా అవి అత్యంత నాసిరకంగా జరిగాయి. మొన్నటి మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో కట్ట కోతకు గురైంది. దీంతో కట్ట తెగ్గిపోకుండా మట్టి బస్తాలు అక్కడక్కడ పెట్టారు.

భయపెడుతున్న కట్ట

ఈ వారంలో కురిసిన భారీ వర్షాలకు రిజర్వాయర్ కట్ట తెగ్గిపోతుందన్న భయం ఇటు అధికారులను, అటు రైతులను కలవర పెట్టింది. దీంతో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా మట్టి బస్తాలను పెట్టారు. కానీ గత వైసీపీ ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యం కాస్త ఇప్పుడు రైతులకు శాపంగా మారింది. భారీ వర్షాలు కురిసి వరద రిజర్వాయర్‌లోకి చేరినా నిల్వ ఉంచలేని పరిస్థితి. దీంతో వచ్చిన నీటిని దిగువకు వదిలేశారు. గత వైసీపీ ప్రభుత్వం వచ్చిన తొలి మూడేళ్ల రిజర్వాయర్ ఆధునికీకరణ పేరుతో సాగునీరు లేకుండా చేసి వైసీపీ నాయకులు విచ్చలవిడిగా రూ.కోట్లాది రూపాయల మట్టి, గ్రావెల్ దోపిడీ చేశారు. అప్పట్లో పూర్తిస్థాయిలో సాగునీరు అందక రైతులు నష్టపోయారు.



కోతకు గురైన కట్టపై మట్టి పోస్తున్న ట్రాక్టర్

ఇప్పుడైనా పనులు పూర్తి చేయించాలి

రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలో ఉండటం, టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నందున రిజర్వాయర్ పనులు పూర్తి చేయించాలని రైతులు కోరుతున్నారు. పనులు పూర్తయితే 1.74 టీఎంసీల నీరు రిజర్వాయర్‌లో నిల్వ ఉంచుకోవచ్చు. దీని ద్వారా రెండు మండలాల ప్రజలకు తాగునీరు, 40 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఆదిశగా సోమిరెడ్డి కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

సోమిరెడ్డితోనే సాధ్యం



సర్వేపల్లి రిజర్వాయర్ అభివృద్ధి ఎమ్మెల్యే సోమిరెడ్డితోనే సాధ్యమవుతుంది. గత వైసీపీ ప్రభుత్వంలో మాజీ మంత్రి కాకాణి మట్టి, గ్రావెల్ దోచుకునేందుకు రిజర్వాయర్ మరమ్మతు పనులు చేయించకుండా గాలికి వదిలేశారు. కొద్దిపాటి పనులు కూడా నాసిరకంగా జరగడంతో వరదలు, తుపాన్లు, భారీ వర్షాలు కురిసినప్పుడు రిజర్వాయర్ కట్ట కోతకు గురవుతోంది. రైతుల సమస్యలు, అవసరాలు తెలిసిన సోమిరెడ్డి చొరవ తీసుకొని రిజర్వాయర్ అభివృద్ధికి కృషి చేస్తారన్న నమ్మకం ఉంది.

- చల్లా నాగార్జున్‌రెడ్డి, ఈదగాలి గ్రామం

కావలి మున్సిపాల్టీలో చౌదరిపాలెం విలీనం లేనట్టే!

- రాష్ట్ర ప్రభుత్వం ఆమోదిస్తే త్వరలో ఎన్నికలు

కావలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కావలి మండలం చౌదరిపాలెం పంచాయతీ ఇక కావలి మున్సిపాలిటీలో లేనట్లే. ఈ పంచాయతీని కావలి మున్సిపాల్టీలో విలీనం చేస్తూ గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ చౌదరిపాలెం వాసులు హైకోర్టును ఆశ్రయించడంతో కావలి మున్సిపల్ ఎన్నికలకు అప్పట్లో బ్రేక్‌పడింది. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంక ట క్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు చౌదరిపాలెంను కావలి మున్సిపాల్టీ విలీనంను వెనుకకు తీసుకుంటున్నట్లు లిఖితపూర్వకంగా ప్రభుత్వానికి నివేదించారు. దీంతో చౌదరిపాలెం విలీనాన్ని కావలి మున్సిపాల్టీ వెనుకకు తీసుకోవడాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆమోదిస్తే త్వరలో కావలి మున్సిపాల్టీకి ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి.

సర్దుబాటు చార్జీల ప్రతిపాదన ఉపసంహరించుకోవాలి

- విద్యుత్ భవన్ ఎదుట సీపీఎం ధర్నా



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

నెల్లూరు వైద్యం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ఇంధన సర్దుబాటు చార్జీల ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవా లని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నెల్లూరులోని విద్యుత్ భవన్ ఎదుట ధర్నా చేశారు. నగర డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు మాట్లా డుతూ విద్యుత్ చార్జీలు తగ్గించ బోమని, ఇతర భారాలను తగ్గిస్తామని ఎన్నికల్లో టీడీపీ హామీ ఇచ్చిందన్నారు. అందుకు భిన్నంగా సర్దుబాటు చార్జీల పేరుతో రూ.8114 కోట్ల భారం వేస్తూ మూడు విద్యుత్ సంస్థలు ప్రతిపాదనలు పంపాయని ఆరోపించారు. విద్యుత్ నియంత్రణ మండలి నోటిఫికేషన్ జారీ చేసిందని మరో రూ.11వేల కోట్ల భారం మోపుతున్నట్లు వార్తలు వస్తున్నాయన్నారు. ఇటువంటి ఆలోచనలను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రూరల్ కార్యదర్శి బత్తల కిష్టయ్య, నాయకులు కిన్నెరకుమార్, కొండాప్రసాద్, అబ్దుల్ అజీజ్, దేవతాటి సంపత్‌కుమార్, వీర్ల శ్రీనివాసులు, షాహినాబేగం, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తన తయారీ కేంద్రాలపై విజిలెన్స్ దాడులు



కేంద్రంలో విత్తనాల వివరాలు తెలుసుకుంటున్న విజిలెన్స్ ఎస్పీ రాజేంద్ర కుమార్

అల్లూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు విత్తన తయారీ కేంద్రాలపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ముందుగా పలువురు అధికారులు దాడులు నిర్వహించి కేంద్రాల్లో నకిలీ విత్తనాలు తయారు చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో విజిలెన్స్ ఎస్పీ రాజేంద్రకుమార్ ఆయా కేంద్రాలకు చేరుకుని పరిశీలించారు. మండలంలోని బీరంగుంటలో ఒకటి, అల్లూరు పట్టణ పరిధిలో రెండు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నకిలీ విత్తనాలతో ఆరుగాలం కష్టపడి వ్యవసాయ చేసే రైతులు తీవ్రంగా నష్టపోతారని, అటువంటి అక్రమాలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ ఏవో వేణు గోపాల్, ఏడీఏ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తీరు మార్చుకోకపోతే చర్యలు

- డీఈవో రామారావు



మాట్లాడుతున్న డీఈవో రామారావు

కావలిటౌన్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి) : పదే పదే చెబుతున్నా కావలి డివి జన్‌లోని అధికారుల్లో మార్పు కనపడడం లేదని, తీరుమార్చుకోకపోతే చర్యలకు సిద్ధంగా ఉండా లని జిల్లా విద్యాశాఖాధికారి పీజే రామారావు హెచ్చ రించారు. శుక్రవారం కావలి జడ్పీ బాలికోన్నత పాఠశాల సమావేశ మందిరంలో కావలి నియోజకవర్గ పరిధిలోని ఎంఈవోలు, సీఆర్‌ఎంటీసీలతో డీఈవో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ టీచర్స్ అటెండెన్స్ విషయంలో పలు ఆరోపణలు ఉన్నాయని, ఇకపై ఎటువంటి ఆరోపణలు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రాపౌట్స్ విషయంలో నిర్లక్ష్యం వీడి చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. పురోగతి కనిపించకపోతే సహించేది లేదన్నారు. ఇకపై ప్రతి విద్యార్థికి 1వ తరగతి నుంచి పీజీ వరకు ఒకే ఐడీ నెంబరు వస్తుందని, అందులో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన (అప్పార్) 9, 10 విద్యార్థుల పూర్తి వివరాలు సేకరణలో అప్రమత్తంగా వ్యవహరించాలని, ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా షోకాజ్ నోటీసులు అందుకునేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు.

వర్షాల్లో బాగా కష్టపడ్డారు

- విద్యుత్ సిబ్బందికి ఎస్ఈ కితాబు

నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురిసిన సమయంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది, కార్మికులు కష్టపడి పనిచేశారని, వారందరికీ ప్రత్యేకంగా అభినందనలు తెలుపుతున్నామని విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్ అన్నారు. ఆయన చాంబర్ నుంచి అధికారులతో శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాన్ హెచ్చరికల ప్రారంభం నుంచి ముగిసేవరకు శాఖలో ప్రతి ఒక్కరు అహర్నిశలు శ్రమించడం అభినందనీయమన్నారు. ముందస్తుగా బృందాలు ఏర్పాటు చేసుకుని, ఎక్కడ విద్యుత్ సమస్య ఏర్పడినా వెంటనే పరిష్కరించేలా జాగ్రత్తలు తీసుకున్నారన్నారు. అలాగే ఇకనుంచి బిల్లుల వసూళ్ళు, సరఫరాలో నాణ్యతను పెంచడంలో నిమగ్నం కావాలని సూచించారు. ఈ సమావేశంలో సీనియర్ గణాంక అధికారి మురళి తదితరులు పాల్గొన్నారు.

పోస్టులు 31.. దరఖాస్తులు 498

- కేజీబీవీల్లో ఉద్యోగాలకు పోటీ
- ధ్రువపత్రాలు పరిశీలించిన అధికారులు



అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న ఎస్ఎస్ఏ అధికారులు

నెల్లూరు (విద్య), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : సమగ్రశిక్ష పరిధిలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) బోధన, బోధనేతర ఉద్యోగాలకు తీవ్ర పోటీ నెలకొంది. జిల్లాలోని 12 కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన, బోధనేతర సిబ్బంది పొరుగుసేవల ప్రాతిపదిన ఏడాదిపాటు భర్తీ చేసేందుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించారు. పీజీటీలు 16, సీఆర్‌టీలు 7, పార్ట్‌టైమ్ టీచర్స్ 7, అకౌంటెంట్ 1 మొత్తం 31 పోస్టులకు 498 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరంతా శుక్రవారం నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని సమగ్రశిక్ష విభాగంలో నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సీహెచ్. ఉషారాణి మాట్లాడుతూ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు 8 మంది సీనియర్ గెజిటెడ్ హోదా కలిగిన ప్రధానోపాధ్యాయులను నియమించినట్లు చెప్పారు. మూడు రోజుల్లో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయ్యాక మెరిట్ ఆధారంగా ఎంపికైన వారి జాబితా విడుదల చేస్తామన్నారు. ఈ సర్టిఫికెట్ల పరిశీలనలో జీసీడీఓ మమత, ఎస్ఎస్ఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ

● రోడ్డుప్రమాదాల నివారణపై వాహనదారులకు అవగాహన

కావలి రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అప్రమత్తతతో రోడ్డుప్రమాదాల నివారణ సాధ్యమని, ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని సీఐ రాజేశ్వరరావు పేర్కొన్నారు. రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం హెల్మెట్ వాడకం, డ్రైవింగ్ లైసెన్స్‌లపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం జాతీయ రహదారిపై పర్యటించి ఎక్కువగా ప్రమాదాలు జరిగే గౌరవరం, తుమ్మలపెంట రోడ్డు, మద్దూరుపాడు ప్రాంతాలను గుర్తించారు. వాహన వేగ నియంత్రణకు రేడియం స్టిక్కర్లతో డ్రమ్ములు, టైర్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు తిరుమలరెడ్డి, బాజీబాబు, ప్రిన్సిపాల్ సుశీల్ కుమార్ ప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

● కందుకూరు : రోడ్డు ప్రమాదాల నివారణపై కందుకూరు టౌన్ ఎస్సై వీ సాంబశివయ్య వాహన చోదకులకు అవగాహన కల్పించారు. శుక్రవారం పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం కూడలి వద్ద వాహనదారులకు పలు సూచనలు చేశారు. విధిగా వాహక చోదకులు డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని సూచించారు.

● ఉదయగిరి రూరల్ : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక వైఎస్ఆర్ సర్కిల్ వద్ద ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించపోతే జరిమానా తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



కావలి రూరల్: హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న సీఐ

వేగనిరోధకాల ఏర్పాటు

● దుత్తలూరు(ఉదయగిరి రూరల్) : ప్రమాదాల నివారణలో భాగంగా మండలంలోని తెడ్డుపాడు గ్రామ సమీపంలో పిల్లాపేరు వాగు వద్ద 565 జాతీయ రహదారిపై వేగనిరోధకాలు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ ఆదిలక్ష్మీ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రమాదాలు జరిగే ప్రదేశంలో డ్రమ్ముల్లో మట్టిని నింపి వాహనాల వేగ నియంత్రణకు చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

రాళ్లపాడు ప్రాజెక్టుకు ఇద్దరు డీఈల నియామకం

లింగసముద్రం (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టుకు ఇరిగేషన్ ఉన్నతాధికారులు ఇద్దరు డీఈలను నియమించారు. ప్రకాశం జిల్లాలోని సంతనూతలపాడు నుంచి డీఈ వెంకటేశ్వర్లును, బాపట్ల జిల్లాలోని అద్దంకి నుంచి ఏఈ మధుసూదనరావును ఇన్‌చార్జ్ డీఈగా ప్రాజెక్టుకు నియమించారు. దీంతో వారు ఇద్దరు శుక్రవారం విధుల్లో చేరారు.

న్యూస్ బాక్స్

నేడు ఎమ్మెల్యే కాకర్ల రాక

ఉదయగిరి రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా శనివారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ రానున్నట్లు మండల టీడీపీ కన్వీనర్ చింతన బోయిన శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈసందర్భంగా వారు మండలంలోని నేలటూరు, శకునాలపల్లి, జీ.చెర్లోపల్లి, జీ.చెరువుపల్లి పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారన్నారు. కావున టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఎమ్పీడీవోకు సన్మానం

కావలిరూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కావలి ఎంపీడీవోగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన శ్రీదేవిని శుక్రవారం టీడీపీ, బీజేపీ నేతలు ఎమ్పీడీవో కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు.

పారిశ్రామికాభివృద్ధికి సహకరించండి

● ఎమ్మెస్ఎంఈ చైర్మన్‌కు అళహరి వినతి



తమ్మిరెడ్డిని సత్కరిస్తున్న అళహరి సుధాకర్

కావలిటౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కావలి పరిసర ప్రాంతాల్లో పారిశ్రామికాభివృద్ధికి సహకరించాలని ఏపీ ఎమ్మెస్ఎంఈ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్‌ని కావలి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి అళహరి సుధాకర్ కోరారు. శుక్రవారం అమరావతిలో అళహరి తమ్మిరెడ్డిని కలిసి జ్ఞాపిక అందించి సత్కరించారు. కావలి సమీపంలోని రామాయపట్నం ఓడరేవు నిర్మాణం జరుగుతున్నందున అందుకు అనుసంధాన పరిశ్రమలను కావలి ప్రాంతంలో ఏర్పాడితే కావలి అభివృద్ధికి దోహదపడడంతోపాటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలియచేశారు.

దెబ్బతిన్న వరిపంట పరిశీలన

అనంతసాగరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి, కచ్చేరిదేవరాయపల్లిలో వర్షాలతో దెబ్బతిన్న వరి పంటను జిల్లా అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ శివన్నారాయణ, ఏడీ దేవసేనమ్మ పంటను చూసి రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏవో శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంతమార్పు.. పల్లెల్లో తక్షణ చర్యలు

● వర్షాలు తగ్గడంతోనే పంచాయతీల్లో పారిశుధ్య పనులు



జలదంకి: బ్రాహ్మణక్రాకలో డ్రైనేజీలో బ్లీచింగ్ చల్లుతున్న పంచాయతీ సిబ్బంది

జలదంకి, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో పంచాయతీలకు అందాల్సిన నిధులు దొడ్డిదారిన రాష్ట్రప్రభుత్వం లాక్కుంది. దీంతో సర్పంచులు కనీసం బ్లీచింగ్ కొనేందుకు కూడా నగదు ఉండేది కాదు. ప్రస్తుతం ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లు కేంద్రప్రభుత్వం అందించే ఆర్థిక సంఘం నిధులు సర్పంచుల ఖాతాల్లో జమచేసింది. దీంతో సర్పంచులు పంచాయతీల అభివృద్ధికి పనులు చేపడుతున్నారు. ఈ క్రమంలో 4రోజులుగా వర్షాలు కురిసి గురువారంతో ఆగిపోయాయి. దీంతో శుక్రవారం జలదంకి మండలంలోని అన్ని పంచాయతీలలో ఎంపీడీవో బ్రహ్మయ్య ఆధ్వర్యంలో బ్లీచింగ్ చల్లి పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టారు. వాటర్‌ట్యాంకులలో బ్లీచింగ్ పౌడర్ కలిపారు. ఇది చూసిన గ్రామీణ ప్రజలు ఎన్నాళ్లైంది పారిశుధ్య పనులు చేపట్టి అని, పాలన అంటే ఇలా ఉండాలంటూ ప్రశంసిస్తున్నారు.

● మర్రిపాడు : మండలంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం శుక్రవారం ఎంపీడీవో నాగేశ్వర ప్రసాద్ నిర్వహించారు. గ్రామాల్లో రోడ్లపై చేరిన నీరు, మురికిని తొలగించారు. ప్రజలు కాచిన నీటిని తాగాలని గ్రామాల్లో దండోరా వేయించారు.

తుఫాన్ బాధితులకు సాయమందించాలి : సీపీఎం

కావలిటౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ తాకిడికి ఇబ్బందిపడ్డ పేదలకు ప్రభుత్వ సాయమందించాలని సీపీఎం నేతలు కోరారు. ఈ మేరకు శుక్రవారం సీపీఎం పట్టణ కార్యదర్శి పెంచలయ్య ఆధ్వర్యంలో ఆర్డీవో వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. తుఫాన్ ప్రభావంతో పట్టణంలోని కాలనీలు నీట మునిగాయని, నిత్యావసరాలు, దుస్తులు, గృహోపకరణాలు నీళ్లపాలైనాయన్నారు. పేద కూలీలకు పనులు లేక ఉపాధి కోల్పోయారని, వెంటనే ప్రభుత్వం స్పందించి వారిని అన్నివిధాలా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నేతలు మధుసూదన్‌రావు, కృష్ణమోహన్, తిరుపాలు, బాబురావు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించండి

బిట్రగుంట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో నిలిపివేసిన గుంటూరు-తిరుపతి మెమో రైళ్లను ప్రయాణికుల సౌకర్యార్థం తిరిగి పునరుద్ధరించాలని, కనీసం తిరుపతి-బిట్రగుంట వరకైనా నడపాలని బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు షేక్.నూరుద్దీన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఇబ్రహీంపేటలో విలేకర్లతో మాట్లాడుతు గుంటూరు- తిరుపతి రైలును నంద్యాల, కడప స్టేషన్ల మీదుగా నడుపుతున్నారన్నారు. బిట్రగుంట పరిసర ప్రాంతాల సామాన్య ప్రజలు గూడూరు, వెంకటగిరి, శ్రీకాళహస్తి, రేణిగుంట, తిరుపతికి వెళ్లాలంటే రైళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సింహపురి ఎక్స్‌ప్రెస్ రైలు వేళలు మార్చేందుకు కృషి చేసిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు దాసరి సునీల్, బత్తుల రవిచంద్ర, ఫ్రాన్సిస్, ఆరోగ్యదాస్, అహ్మద్‌బాషా, చిట్టేటి శివకుమార్ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం తగదు

కావలి రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్పీడీవో శ్రీదేవి హెచ్చరించారు. కావలి మండలం సర్వాయపాలెం సచివాలయాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సకాలంలో హాజరు నమోదు ఉండాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చెయ్యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామక్రిష్ణ, వీఆర్వో హరీష్, ఏఎన్ఎం, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయం

వలేటివారిపాలెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వం ప్రధాన ధ్యేయం అని మండల టీడీపీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం తెలిపారు. మండలంలోని చుండి, అంకభూపాలపురం, కళవళ, పోలినేనిపాలెం గ్రామాల్లో శుక్రవారం ఆయన గ్రామ టీడీపీ నాయకులతో కలిసి సిమెంటు రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు అనుమోల అమరేశ్వరి ఇరపని సతీష్, టీడీపీ నాయకులు కామినేని అశోక్, కామినేని వీరయ్య, చొప్పర చినబ్రహ్మయ్య, మేకల అశోక్, ప్రెగడ శ్రీనివాసులు, పంది లక్ష్మీనారాయణ, బక్కమంతుల మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

జస్టిస్ లక్ష్మణరావుకు ఘన నివాళి

కావలిటౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రం రెడ్‌క్రాస్ పూర్వపు అధ్యక్షుడు జస్టిస్ లక్ష్మణరావు గురువారం మృతి చెందడంతో శుక్రవారం స్థానిక రెడ్‌క్రాస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్, రెడ్‌క్రాస్ బాధ్యులు కలికి శ్రీహరి రెడ్డి, హరినారపరెడ్డి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

డిస్లెక్సీయపై అవగాహన ర్యాలీ

సీతారామపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక భవిత కేంద్రంలో శుక్రవారం డిస్లెక్సీయపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా భవిత కేంద్రం నుండి విద్యార్థినీ, విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎంఈవో మస్తాన్‌వలి మాట్లాడుతూ డిస్లెక్సీయ అనేది ఒక రకమైన అభ్యాస వైకల్యం అని, అభ్యాస వైకల్యం ఉన్న వ్యక్తి పదాలు, సంఖ్యల ఉచ్చారణలో, అర్థం చేసుకోవడంలోనూ ఇబ్బంది పడుతుంటారన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, బెస్తకాలనీ ఎంపిపి స్కూల్ ప్రధానోపాధ్యాయులు తిరుపతయ్య, ఐఈడిఎస్ఎస్ అన్సార్ బాష, ఐఈఆర్‌టి విజయ్, ఉపాధ్యాయులు వెంగయ్య, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఒరిగిన స్తంభాలను సరిచేసిన విద్యుత్ సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వలేటివారిపాలెం (ఆంధ్ర జ్యోతి): మండలంలోని కూని పాలెంలో ప్రధాన రహదారి పక్కన ఒరిగిపోయిన నాలుగు విద్యుత్ స్తంభాలను విద్యుత్ ఏఈ తాటికొండ మధుబాబు ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం నిటారుగా నిలబెట్టారు. ఒరిగిన విద్యుత్ స్తంభాలు అని ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించి ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాలను సరిచేసి నిటారుగా నిలబెట్టారు. దీంతో ఏళ్లతరబడి పరిష్కారం కాని సమస్య ఆంధ్రజ్యోతి కథనంతో పరిష్కార మయిందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఒరిగిపోయిన స్తంభాలను నిలబెడుతున్న విద్యుత్ సిబ్బంది

మాలమాదిగలను విడగొట్టడం రాజ్యాంగ విరుద్ధం

● మాలల మహాగర్జనను విజయవంతం చేద్దాం : ఎల్లు సాల్మన్‌రాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లు సాల్మన్‌రాజు

అల్లూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మాల మాదిగలను విడగొట్టడం రాజ్యాంగ విరుద్ధమని, ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా నిర్వహించే మాలల మహాగర్జనను విజయవంతం చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు అన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన దళితులతో కలసి అల్లూరులో ఆయన శుక్రవారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసం మాల మాదిగలను విడగొడుతూ ఎస్సీ వర్గీకరణ అనే ప్రక్రియను తెరపైకి తీసుకొచ్చారని, దీనికి వ్యతిరేకంగా చేపట్టాల్సిన కార్యాచరణను రూపొందించడం జరిగిందన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా నిర్వర్తించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. నవంబరు 4న అల్లూరులో నిర్వహించే మాలల మహాగర్జన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అరగల రమణయ్య, పంగులూరు శ్రీనివాసులు, దానం మాల్యాద్రి, పంగులూరు సుధాకర్, ముసలి నరేంద్ర, కమలాకర్, చెన్నయ్య, దగ్గుల మనోహర్, గంగపట్నం సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మార్చి నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి



పక్కాగృహాన్ని పరిశీలిస్తున్న ఈఈ దయాకర్

ఉదయగిరిరూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): హౌసింగ్ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టే లబ్ధిదారులు వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తిచేయాలని హౌసింగ్ ఈఈ దయాకర్ సూచించారు. శుక్రవారం మండలంలోని శకునాలపల్లి, ఫుల్లాయపల్లి గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న పక్కాగృహాలను పరిశీలించి లబ్ధిదారులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద గృహ లబ్ధిదారులకు అందాల్సిన 90 రోజుల పనిదినాల నగదును త్వరితగతిన అందించాలన్నారు. లబ్ధిదారులు పొదుపు గ్రూపుల్లో సభ్యులు అయినట్లయితే వారికి రూ.35 వేల రుణం ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అప్పాజీ, హౌసింగ్ ఏఈ రామకృష్ణ, ఏపీఎం ఖాజారంతుల్లా, ఏపీవో శ్రీనివాసులు, వర్క్ ఇన్‌స్పెక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ షరీఫ్ పాల్గొన్నారు.

వెలుగొండ పూర్తిచేసి వలసలు నివారించాలి

ఉదయగిరి రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రానున్న బడ్జెట్ సమావేశాల్లో వెలుగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు పూర్తి చేసి వలసలు నివారించాలని వెలుగొండ సాధన సమితి నాయకుడు డాక్టర్ శ్యాంప్రసాద్, సాగునీటి రంగ నిపుణుడు నారాయణరెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక కోట్నీస్ ప్రజా వైద్యశాల ఆవరణలో వెలుగొండ సాధన సమితి ప్రజా సంఘాలు, జిల్లా సాధన సమితి నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విలేఖరులతో మాట్లాడుతూ జిల్లాలోని మెట్ట ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించే ఏకైక వనరు వెలుగొండ ప్రాజెక్టు అన్నారు. అయితే పాలకుల నిర్లక్ష్యం కారణంగా ప్రాజెక్టు పనులు మందకొడిగా సాగుతున్నాయన్నారు. బడ్జెట్ సమావేశాల్లో వెలుగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని, లేదంటే సాధన సమితి ఆధ్వర్యంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రాజెక్టు పూర్తయితే మూడు జిల్లాల్లో తాగునీటి కష్టాలు తీరడంతో పాటు ఫ్లోరైడ్ సమస్య తీరుతుందన్నారు. పార్టీలకతీతంగా వెలుగొండ ప్రాజెక్టు పూర్తికోసం ఉద్యమించి ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధన సమితి నాయకులు దస్తగిరిఅహ్మద్, గాజులపల్లి రామిరెడ్డి, రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య, ఫడ్స్ డైరెక్టర్ పీవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మద్యం దుకాణాలు సీజ్

కావలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ మద్యం దుకాణాల పాలసీని అమల్లోకి రావడంతో ప్రభుత్వ మద్యం దుకాణాలను సీజ్ చేశారు. కావలి సర్కిల్ పరిధిలో 16 ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉండగా వాటిని రెవెన్యూ అధికారులతో కలిసి ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేసి ప్రతి దుకాణంలో ఉన్న మద్యం నిల్వలను, ఫ్రిజ్ తదితర సామగ్రిని రికార్డుల్లో నమోదు చేసి సీజ్ చేశారు. దుకాణాల తాళాలను కావలి ఎక్సైజ్ సీఐ సుంకర శ్రీనివాసులు తమ వద్ద ఉంచుకున్నారు. అయితే ఆయా దుకాణాల్లో ఉన్న మద్యం నిల్వలతో పాటు అక్కడ ఉన్న సామగ్రిని నెల్లూరు డిపోకు చేర్చమని అధికారులు ఆదేశాలు ఇచ్చారు. అక్కడ ఉన్న సామగ్రి విలువల కన్నా వాటిని నెల్లూరుకు చేర్చేందుకు అయ్యే రవాణా ఖర్చులు అధికంగా కనిపిస్తున్నాయని చెబుతున్నారు. దీంతో రవాణా ఖర్చులపై ఎక్సైజ్ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

అదుపుతప్పి ఆటో బోల్తా - ఒకరి మృతి

కందుకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి ఆటో బోల్తాపడడంతో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన దొండపాడు వద్ద శుక్రవారం జరిగింది. కందుకూరు రూరల్ ఎస్సై మహేంద్ర నాయక్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పాలురు గ్రామం నుంచి కందుకూరుకు వెళుతున్న ఆటో దొండపాడు వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. ఈ సంఘటనలో ఆటోలో ఉన్న మార్తాటి లక్ష్మయ్య(60) అక్కడికక్కడే మృతిచెందాడు. అతనితోపాటు మరో ముగ్గురు మహిళలకు స్వల్ప గాయాలు అయ్యాయి. లక్ష్మయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కందుకూరు ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న ఏడీఏ లక్ష్మీమాధురి

ఉదయగిరి రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించేలా గ్రామ వ్యవసాయ సహాయకులు చర్యలు చేపట్టాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లక్ష్మీమాధురి, కృషివిజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేత్త విజయకుమార్‌నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవనంలోని సబ్ డివిజన్‌లో వ్యవసాయ సహాయకులకు సామర్థ్య పెంపుపై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ పంటల సాగులో మేలైన వంగడాలు ఎంచుకోవడంతో పాటు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయించాలన్నారు. రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రీయ ఎరువులు వాడేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ పీ.చెన్నారెడ్డి, వ్యవసాయాధికారులు వెంకటసుబ్బారెడ్డి, చక్రవర్తి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై వరి విత్తనాల పంపిణీ

జలదంకి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జలదంకి రైతుసేవాకేంద్రంలో శుక్రవారం రైతులకు రాయితీపై వరి విత్తనాలు పంపిణీ చేశారు. కేఎస్ఎం-1638 రకం విత్తనాలు 30 కిలోలు రూ.1065లకు అందించామని ఏవో బీ శైలజ పేర్కొన్నారు. రాయితీపై విత్తనాలు కావాలంటే స్థానిక రైతుసేవాకేంద్రాల్లో వీఏఏలను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ శివప్రియ, టీడీపీ మండల అధ్యక్షుడు పి.మధురెడ్డి, జలదంకి ఉపసర్పంచు కె.మాలకొండారెడ్డి, పాల్గొన్నారు.

● సంగం : మండలంలోని రైతు సేవాకేంద్రాల్లో బీపీటీ -5204, కెఎస్ఎం -1638 రకం వరి విత్తనాలు కేజీకి రూ. 5 చొప్పున రాయితీపై ఇస్తున్నామని వ్యవసాయాధికారి శ్రీహరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన రైతులు తీసుకెళ్లవచ్చునని తెలిపారు.

● కలిగిరి: రైతులకు శనివారం నుంచి రాయితీపై వరి, శనగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయాధికారి ఎం సురేష్‌బాబు తెలిపారు. వరి రకం కెఎ స్ఎం-16380, శనగ రకం జెజీ-11, కేఎకె2, వితనాలు 25శాతం రాయితీతో అందజేస్తామని తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



తనిఖీలు చేపడుతున్న నీరజ

వరికుంటపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దుకాణదారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు సాగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని డివిజనల్ ఫుడ్ కంట్రోల్ అసిస్టెంట్ అధికారి నీరజ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన వరికుంటపాడులోని పలు దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనుమతులు లేని దుకాణాలకు నోటీసులు అందజేయడం జరిగిందన్నారు. కొనుగోలుదారులు తప్పనిసరిగా వస్తువులపై తయారీ, గడువు తేదీలను గమనించాలన్నారు. దుకాణదారులు సైతం అలాంటి ప్రమాణాలు కలిగిన వస్తువులను మాత్రమే విక్రయించాలని సూచించారు. కాగా, సమాచారం అందుకున్న కొంతమంది దుకాణదారులు హడావిడిగా తమ దుకాణాలకు తలుపులు వేసి అక్కడి నుంచి జారుకోవడం గమనార్హం.

దివీస్ ల్యాబ్‌కు 20 మంది విద్యార్థులు ఎంపిక

కందుకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం కాలేజీలో దివీస్ ల్యాబ్ శుక్రవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ప్రాంగణ ఎంపికల్లో 20 మంది విద్యార్థులు ఉద్యోగ అర్హత సాధించినట్లు కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కే విజయ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. వీరికి వార్షిక వేతనం రూ.3 లక్షలు ఉంటుందని కంపెనీ ప్రతినిధి హెచ్ఆర్ రామకృష్ణ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ నవీన్, ఆర్అండ్‌డీ డీన్ డాక్టర్ ఎం లక్ష్మణరావు, మెకానికల్ హెచ్‌ఓడీ డాక్టర్ పున్నారావు, కోటయ్యలు పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి ఎమ్మెల్యే ప్రశాంతి

విడవలూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి రైతుల పక్షపాతి అని రామతీర్థం, వీరారెడ్డిపాలెంలకు చెందిన టీడీపీ నాయకులు తాతా రమేష్, తుళ్లూరు మాధవ్‌లు తెలిపారు. వీరారెడ్డిపాలెంలో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వరుణి పంచాయతీ, రామతీర్థం పంచాయతీలలో సొంత నిధులు వెచ్చించి ఎమ్మెల్యే కాలువ పూడికతీత పనులను చేపట్టారన్నారు. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు పంట పొలాలు మునగకుండా రైతులకు ఎంతగానో ప్రయోజనం చేకూరిందన్నారు. గత వైసీపీ పాలనలో కాలువ పూడికతీత పనుల్లో రూ.లక్షలాది దుర్వినియోగమయ్యాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాడా నరేంద్ర, ఉప్పాల వెంకటరమణయ్య, ఉప్పాల శీనయ్య, తిరుపతయ్య, రఘు, తదితరులు పాల్గొన్నారు.

వర్షం వస్తే బురదలో ఉండాల్సిందే!

విడవలూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం వస్తే ఇంట్లోకి నీళ్లు వచ్చి నానా ఇబ్బందులకు గురవుతున్నామని వరిణి పంచాయతీ వీరారెడ్డిపాలెంకు చెందిన గిరిజన కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాలనీలో సుమారు 100 కుటుంబాలు ఉన్నాయని, అధికారం రాగానే కాలనీలో సీసీరోడ్లు, మురికి కాలువలు కట్టిస్తామని హామీ ఇచ్చిన వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారని ఆరోపించారు. కోవూరు ఎమ్మెల్యే చొరవ తీసుకుని కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించాలని వారు కోరారు.

భూ'సంరక్షణ' కరువు

- శిథిలావస్థలో ఏడీ కార్యాలయం ● పెచ్చులూడి పడుతున్న శ్లాబ్
- చెదులు పడుతున్న దస్త్రాలు ● బిక్కుబిక్కుమంటున్న ఉద్యోగులు

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయశాఖలో భాగమైన భూసంరక్షణ(సాయిల్ కన్సర్వేషన్) విభాగానికి చెందిన సహాయ సంచాలకుల(ఏడీ) కార్యాలయం శిథిలావస్థకు చేరింది. నగరంలోని బట్వాడిపాళెం సమీపంలో గల తెలుగుగంగ ప్రాజెక్టు విభాగం భవనాల్లోనే ఈ కార్యాలయం కూడా ఉంది. దీనికి వ్యవసాయశాఖ అద్దెకూడా చెల్లిస్తోంది. ఇందులో ఐదుగురు వ్యవసాయశాఖ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు, నలుగురు వ్యవసాయ విస్తరణ అధికారులు, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు విధులు నిర్వహిస్తున్నారు.

వైసీపీ పాలనలో నిర్వీర్యం

వ్యవసాయంలో పురుగు మందులు, ఎరువులను నియంత్రించడం, బంజరు భూమి, బీడు భూము లను సక్రమంగా వినియోగించడం, నీటి నిర్వహణ, మొక్కల పెంపకం వంటి వాటిపై రైతులకు అవగాహన కల్పించడం ఈవిభాగం ముఖ్య ఉద్దేశం. దీనికోసంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు చేస్తుంటాయి. గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో ఈ విభాగం బాగానే పనిచేసింది. అయితే వైసీపీ ప్రభుత్వం రాగానే పథకాలన్నీ అటకెక్కాయి. దీంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులకు పనిలేకుండా పోయింది. ఈ నేపథ్యంలో వారిని జిల్లా వ్యవసాయాధికా రి కార్యాలయం, జిల్లా రీసోర్స్ పర్సన్ కార్యాల యం, రైతు శిక్షణ కేంద్రం, పలు మండలాలకు బదిలీ చేశారు. ఇటీవల మళ్లీ కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో గతంలో ఉన్న పథకాలు తిరిగి ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి.





కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు వచ్చే అవకాశం కూడా ఉంది.

హడలిపోతున్న సిబ్బంది

ప్రస్తుతం ఈ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. శ్లాబు పెచ్చులూడి పడుతుండటంతో కార్యాలయానికి రావాలంటే అధికారులు, సిబ్బంది హడలిపోతున్నారు. ఫ్యాను వేస్తే ఎక్కడ శ్లాబు ఊడుతుందోనని భయం. ఈ భవనంలో ఒక్క గది మాత్రమే అంతంత మాత్రంగా ఉంది. మిగిలిన గదులన్నీ దుమ్ము, ధూళితో నిండిపోయి ఉన్నాయి. దస్త్రాలన్నీ దాదాపుగా చెదలు పట్టే పరిస్థితికి చేరుకున్నాయి. కిటికీలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. రికార్డులకు కనీస భద్రత లేకుండా పోయింది. వీటికితోడు విష కీటకాల బెడద ఎక్కువగా ఉందని అధికారులు చెబుతున్నారు. కార్యాలయాన్ని వేరే భవనానికి మార్చాలని కోరుతున్నారు.



ధ్వంసమైన కిటికీ, చిందరవందరగా కుర్చీలు

చెత్తకనిపిస్తే సస్పెండే!

- పారిశుధ్య ఉద్యోగులకు కమిషనర్ సూర్యతేజ హెచ్చరిక
- మంత్రి మండిపాటుతో క్షేత్ర స్థాయి సమీక్ష



నెల్లూరు(సిటీ),అక్టోబరు18(ఆంధ్రజ్యోతి) : 'నేను ఎప్పుడు, ఏ డివిజన్‌లో తిరగతానో నాకే తెలియదు. కారులోనుంచే చూస్తా. ఎక్కడ చెత్త కనపడితే అక్కడే స్థానిక పారిశుధ్య పర్యవేక్షణ అధికారికి షోకాజ్ నోటీసు ఇస్తా. సమాధానం సరిలేకపోతే సస్పెండ్ చేసేస్తా!'అంటూ కార్పొరేషన్ కమిషనర్ మల్లవరపు సూర్యతేజ సచివాలయ పారిశుధ్య ఉద్యోగులను హెచ్చరించారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయం లో ఆరోగ్య విభాగంతో ఆయన సమీక్ష జరిపారు. గురువారం మంత్రి నారాయణ పారిశుధ్య లేమిపై ఆగ్రహం వ్యక్తంచేసి ఆరుగురు ఉద్యోగులకు షోకాజు నోటీసు ఇచ్చిన నేపథ్యంలో డివిజన్ల వారీగా రివ్యూ చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్లపై చెత్త, కాలువల్లో మురుగు కనపడకూడదన్నారు.

ఆస్తి పన్ను చెల్లించకుంటే అత్యవసర సేవలు కట్

నగరాభివృద్ధిలో భాగంగా ఆస్తి పన్నును ప్రతీ ఒక్కరు చెల్లించాలని, లేకపోతే వారికి అందుతున్న అత్యవసర సేవలను కట్ చేస్తామని కమిషనర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరు ఆస్తి, కొళాయి, డ్రైనేజీ పన్నులను విధిగా చెల్లించాలని కోరారు.

వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- డీఎంహెచ్‌వోకు ఏపీ హంస వినతి

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 18 (ఆంధ్ర జ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలోని ఉద్యోగుల సమ స్యలను పరిష్కరించాలని ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు జిల్లా వైద్య ఆరో గ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్యకు వినతిపత్రం అందించారు. శుక్రవారం డీఎంహెచ్‌వోను ఆయన చాంబర్‌లో కలిసి ఉద్యోగుల సమస్యల పై చర్చించారు. అల్లూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వ హిస్తూ ఇటీవల మృతి చెందిన రమేష్ కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వాలని కోరారు. జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా అన్ని అర్హతలు ఉండి హెల్త్ అసిస్టెంట్‌గా సేవలందిస్తూ ప్రస్తుతం జగదేవిపేట పీహెచ్‌సీలో పనిచేస్తున్న మాధవ్‌ను రెగ్యులర్ చేయాల న్నారు. సచివాలయంలో గ్రేడ్-3 ఏఎన్‌ఎంలుగా పని చేస్తున్న వారికి ఉద్యోగోన్నతి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హంస జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, మురళి, మహేష్, ఉమామ హేశ్వర్, నాగయ్య, మాధవ్, సర్వే శాఖ అసోసియేషన్ నేతలు మధుసూదన్‌రెడ్డి, బాలనాగమ్మ, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.



డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందిస్తున్న నేతలు

సంఘ సేవకుడు బండి సుధాకర్‌రెడ్డి మృతి



సుధాకర్‌రెడ్డి (ఫైల్)

కోవూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కోవూరు పట్టణానికి చెందిన స్వచ్ఛంద సేవకుడు బండి సుధాకర్‌రెడ్డి శుక్రవారం అకస్మాత్తుగా నెల్లూరు నగరంలోని గోమతినగర్‌లో ఉన్న నివాసంలో మృతి చెందారు. శనివారం మధ్యాహ్నం గోమతినగర్‌లోని నైసా అపార్ట్‌మెంట్ నుంచి ఆయన అంత్యక్రియలు ప్రారంభమవుతాయని కుటుంబసభ్యులు తెలిపారు. ఈయన కోవూరు ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు నిత్యం సేవలందించేవారు. దివ్యాంగులకు మూడుచక్రాల బండ్లు సమకూర్చారు. ఇటీవల శ్మశాన వాటికలో శవాలను భద్రపరిచే గదిని నిర్మించారు. ఆయన నేత్రాలను సుభాష్‌సేవా సంఘం ఆధ్వర్యంలో మోడరన్ హాస్పిటల్ సిబ్బంది సేకరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని శెట్టిగుంట రోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సర ఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎం శ్రీధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అయ్యప్ప గారి తోట, దీనదయాళ్‌నగర్, పల్లెపాడు ప్రాంతాల్లో సరఫరా ఉండదని తెలిపారు. అలాగే, వెంకటేశ్వర పురం, యలమవారిదిన్నె, ఎంజీ నగర్ సబ్‌స్టేషన్ల పరిధి లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నామని, గాంధీగిరిజన కాలనీ, సాలుచింతల, మిట్టపాళెం, ఆకుతోట బలిజపాళెం, మల్లెలమ్మ తోట, రాజగోపాల్‌పురం, బ్రహ్మానందపురం, ఆదర్శ్‌నగర్, సుజాతమ్మ కాల నీ, జేవీఆర్ కాలనీ, లక్ష్మీనరసింహపురం, కేవీఆర్ పెట్రోల్ బంకు, ఎస్పీ కార్యాలయం, నీలగిరి సంఘం, బారాషహీద్ దర్గా ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. దీనిని వినియోగదారులు గుర్తించాలని కోరారు.

పోలేరమ్మ జాతరకు ఆహ్వానం

సైదాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్వహించే పోలేరమ్మ జాతరకు కమిటీ పెద్దలు శుక్రవారం తహసీల్దార్ రమాదేవిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా జాతర పెద్దలు మాట్లాడుతూ మూడు సంవత్సరాలకు ఒక్కసారి పోలేరమ్మ జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఈనెల 22వ తేదీ నుంచి 24 వరకు పోలేరమ్మ జాతర నిర్వహించడం జరుగుతుందన్నారు.

వీఎస్‌యూలో అడ్మిషన్ల గడువు పెంచండి

- వీసీ విజయభాస్కర్‌రావుకు టీఎన్‌ఎస్‌ఎఫ్ వినతి

వెంకటాచలం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్శిటీలో స్పాట్, మేనేజ్మెంట్ అడ్మిషన్ల గడువు పెంచాలని టీఎన్‌ఎస్‌ఎఫ్ మండలాధ్యక్షుడు నలజాలపు వెంకటాద్రి కోరారు. ఈ మేరకు మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో శుక్రవారం వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అడ్మిషన్లపై ఈనెల 14 నుంచి 19 వరకు నోటిఫికేషన్ ఇచ్చి ఉన్నారన్నారు. కానీ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు యూనివర్శిటీకి మూడు రోజులు సెలవు ఇచ్చారన్నారు. దీంతో విద్యార్థులు రాలేకపోయారన్నారు. అడ్మిషన్ల గడువును మరో వారం రోజులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మనోజ్, అశోక్, సురేష్, కాలేషా, మహేష్ తదితరులు న్నారు.



వీసీకి వినతిపత్రం అందజేస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నేతలు

అధిక ఫీజులపై చర్యలు తీసుకోండి

విక్రమ సింహపురి యూనివర్శిటీ పరిధిలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలలు విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్‌యూ జిల్లా కార్యదర్శి సుకుమార్ ఆరోపించారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ బీఈడీ 2015 నుంచి 2022 వరకు చదివిన విద్యార్థులకు వన్‌టైం ఆపర్చునిటీ కింద పరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సంతోష్, అశ్విన్, చక్రి తదితరులు పాల్గొన్నారు.

తాటిపర్తి రహదారిపై తూములు ఏర్పాటు చేయాలి

- సౌత్‌మోపూరు వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెల్లూరు రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు - తాటిపర్తి రహదారిపై సౌత్‌మోపూ రు వద్ద కల్వర్టులో తూములు ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు ఆందోళన చేశారు. సౌత్‌మోపూరు వద్ద ఆధునీకరణ పనుల్లో దెబ్బ తిన్న రోడ్డు వద్ద శుక్రవారం ధర్నా చేశారు. ఈ ప్రాంతంలో కారు గుంతలోపడి దెబ్బతినడాన్ని ఆంధ్రజ్యోతి శుక్రవారం సంచికలో ప్రచురించింది. దీనికి స్పందించిన సీపీఎం నాయకులు నాయకులు మాట్లాడుతూ రహదారిపై 17వ కి.మీ. వద్ద తూములు లేక వరద, వర్షపు నీరు రోడ్డెక్కుతోందని చెప్పారు. కనుపూ రు కాలువలోని నీళ్లు, రామయ్య చెరువులోకి వచ్చి అక్కడి నుంచి రోడ్డుపై ప్రవహిస్తున్నా యన్నారు. వెంటనే కల్వర్టు వద్ద తూములు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆలూరు తిరుపాలు, పూడిపర్తి జనార్దన్, జానా లక్ష్మీప్రసాదవ్, శ్రీపతి వెంకయ్య, అట్ల అనిల్ పాల్గొన్నారు.

నేర నియంత్రణకు 156 సీసీ కెమెరాల ఏర్పాటు

పొదలకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : నేర నియంత్రణ కోసం గ్రామస్థాయి నుంచే చర్యలు చేపట్టేందుకు ఏపీ ప్రభుత్వం, పోలీసు శాఖ సన్నాహాలు చేస్తోందని, అందులో భాగంగా పొదలకూరు మండలంలో 156 ప్రాంతాల్లో అతి త్వరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు, మెయిన్ రోడ్డు, పంచాయతీ బస్టాండులో ఉన్న పలు దుకాణదారుల యజమానులతో ఎస్‌ఐ హనీఫ్‌తో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని పలు దుకాణాల యజమానులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల పంపిణీ

ముత్తుకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పైనంపురం పంచాయతీలో నివాసముంటున్న చిన్న సంఘం గిరిజనులకు సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు శుక్రవారం కూరగాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో మూడు రోజులు పాటు కురిసిన వర్షాలతో గుడిసెల్లో నివాసం ఉంటున్న గిరిజనులకు తమ వంతుగా కూరగాయలు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గమ్మినేని వాణిభవానీనాయుడు, సందురి శ్రీహరి, రహీం, బోలా అశోక్, చిన్న, కావలి మస్తాన్, కావలి కవిత పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

కోవూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శాఖ గ్రంథాలయం ఎదుట శుక్రవారం మండల పరిషత్ పాఠశాల విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని కె.భారతి మాట్లాడుతూ బాలలు నాటిన మొక్కలను సంరక్షిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పల్లెటూళ్లకు మంచి భవిత : టీడీపీ నేత కోటంరెడ్డి

నెల్లూరు రూరల్, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి) : ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పల్లెటూళ్లకు మంచి భవిష్యత్ వచ్చిందని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ములుముడి గ్రామంలో రూ. 20 లక్షలతో నిర్మిచ తలపెట్టిన సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువలకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేస్తున్నారని చెప్పారు. ప్రతీ గ్రామంలోనూ సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువలు పూర్తిగా ఉండాలన్న సంకల్పంతో మండలంలోని 18 పంచాయతీలకు రూ.2 కోట్లు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయకుమార్, ఎంపీడీవో శైలేంద్ర కుమార్, సర్పంచ్ కరుణాకర్, నాయకులు పులి రాంగోపాల్, వేదగిరి క్షేత్రం మాజీ చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, అల్ల నరసయ్య, మన్సూర్ పాల్గొన్నారు.

ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేయవద్దు

మనుబోలు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయకుండా, వారిని గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చాలని ఆటో కార్మికులకు ఎస్‌ఐ శివరాకేష్ హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద శుక్రవారం ఆయన రోడ్డుభద్రత నియమాలపై ఆటోకార్మికులతో సమావేశం నిర్వహించారు. హైవే ప్రయాణం, వాటి నిబంధనలు గురించి ఆటో కార్మికులకు అవగాహన కల్పించారు. ఆటో కార్మికులు చెడువ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. వేగంగా ఆటోలు నడిపి ప్రమాదాలకు గురికావద్దన్నారు. ఆటో డ్రైవర్లు పోలీసులు ఇచ్చిన సూచనలను పాటించాలన్నారు. దీనిపై వారితో ప్రమాణాలు చేయించారు. ఎస్‌ఐ ఆటో కార్మికుని వలె ఆటోచొక్కా ధరించి వారికి అవగాహన కల్పించడం విశేషం.

రక్షణ చట్టాలపై విద్యార్థులకు అవగాహన

నెల్లూరు(క్రైం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బుజబుజ నెల్లూరులోని హైస్కూల్లో శుక్రవారం వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ కిశోర్ కుమార్ విద్యార్థులకి రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, మత్తు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ట్రాఫిక్ నిబంధనలు తదితర అంశాలను వివరించారు. ఈవ్‌టీజింగ్ చేయరాదని, సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర వేళల్లో 112 నెంబరుకు కాల్ చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయితీ పథకాలపై అవగాహన

సైదాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాగణం రాజుపాళెం గ్రామంలో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హార్టికల్చర్ అధికారి ఆనంద్ మాట్లాడుతూ ఉద్యానశాఖ ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న రాయితీ పథకాలపై అవగాహన కల్పించారు. నిమ్మ చెట్లకు వచ్చే చీడ,పీడల నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఏవో హైమావతి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తిరుమలకు శ్రీవారి భక్తుల పాదయాత్ర

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పడారుపల్లి నుంచి గోవింద మాల ధరించిన భక్తులు శుక్రవారం తిరుమలకు పాదయాత్రగా బయలుదేరారు. ఈ యాత్రను టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ప్రారంభిం చారు. 23వ డివిజన్ కార్పొరేటర్ ఒరిస్సా శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఇది 10వ పాదయాత్ర. స్థానిక కల్యాణ వేంకటే శ్వర స్వామి ఆలయంలో ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

న్యూస్ బాక్స్

'ఆశాను విధుల్లోకి తీసుకోవాలి'

నెల్లూరు(వైద్యం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కలిగిరి మండలం రావులకొల్లు గ్రామ ఆశా కార్యకర్త విజయమ్మను అక్రమంగా విధుల నుంచి తొలగించటం దారుణమని, ఆమెను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని పురమందిరం రీడింగ్‌రూమ్‌లో పెంచల నర్సయ్య అధ్యక్షతన ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ ఎటువంటి ఆరోపణలు లేకుండా, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా రాజకీయ కక్షతో ఆశా కార్యకర్తను ఉద్యోగం నుంచి తొలగించారన్నారు. ఆమెను విధుల్లోకి తీసుకునే వరకు బాధితురాలికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్, రైతు సంఘం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు శ్రీరాములు, మూలి వెంగయ్య, పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి ఎల్లంకి వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగలం పుల్లయ్య పాల్గొన్నారు.

బీసీలకు రక్షణ చట్టంపై హర్షం

వెంకటాచలం (ఆంధ్రజ్యోతి) : బీసీలకు రక్షణ చట్టం కల్పిస్తున్న ట్లు సీఎం చంద్రబాబు ప్రకటించడం అభినందనీయమని టీడీపీ జిల్లా కార్యదర్శి ఈదర శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో బీసీలపై విపరీతమైన దాడులు జరిగాయని, అణిచివేతకు గురయ్యారన్నారు. బీసీల కో సం కొత్త చట్టం టీడీపీ ప్రభుత్వం రూపొందిస్తుండడంతో చాలా సంతోషంగా ఉందన్నారు.

మా కాలనీలో మద్యం షాపొద్దు

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): జొన్నవాడ రోడ్డు సమీపంలో కామాక్షికాలనీలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం అక్కడి నుంచి తొలగించాలని ఆ ప్రాంతంలో ప్రజలు తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లుకు ఎక్సైజ్ సీఐ కిషోర్‌బాబుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. చుట్టూ పాఠశాలలు, అంగన్‌వాడీ స్కూలు, ఓ వైపు ప్రైవేటు వైద్యశాల, మధ్యలో పోలేరమ్మ చెట్టు, జనావాసాల మధ్య మద్యం దుకాణం వద్దంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు.

నేటి నుంచి విగ్రహాల ప్రతిష్ఠ

తోటపల్లిగూడూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కొత్తపాలెంలో వెలిసి ఉన్న చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం నుంచి శ్రీదేవి భూదేవిల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు నాగరాజుస్వామి పేర్కొన్నారు. 19న సాయంత్రం 6గంటలకు పుణ్యాహవచనం, మండపారాధన, రక్షాబంధన, అఖండ దీపారాధన, వాస్తు పూజ, వా స్తు హోమం, 20న పంచగవ్యావాచన, యుక్త హోమాలు, శ్రీదేవిభూదేవి జలాధివాసం అభిషేకం జరుగుతుందని తెలిపారు. మధ్యా హ్నం 3గంటలకు అమ్మవార్లకు గ్రామోత్స వం, 21న శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి కల్యాణం జరుగుతుందన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

మనుబోలు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రీసర్వే జరిగిన రెవెన్యూ గ్రామాల్లో మాత్రమే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు సీహెచ్.సుబ్బయ్య తెలిపారు. ఈనెల 19 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు ఈ సదస్సులు 15 రెవెన్యూ గ్రామాల్లో నిర్వహిస్తున్నామన్నారు.

బిల్లులకు ఢోకా లేదు...

మనుబోలు (ఆంధ్రజ్యోతి): బిల్లులకు ఎలాంటి ఢోకా లేదు.. లబ్ధిదారుల కు చెప్పి త్వరగా ఇళ్లు నిర్మించుకునేలా ఇంజనీ రింగ్ అసిస్టెంట్లు చొరవతీసుకోవాలని ఎంపీడీవో జలజాక్షి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవా రం ఆమె ఇంజనీ రింగ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం, క్లోరినేషన్‌పై దృష్టి సారించాలన్నారు. బిల్లులు రాని వారి వివరాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణశాఖ ఏఈ. భాస్కర్ పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

బుచ్చిరెడ్డిపాళెం,అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెంలోని ఇటీవల భారీ వర్షాలకు కొత్త బస్టాండ్ దగ్గర నుంచి మలిదేవి కాలువ బ్రిడ్జితోపాటు శివాలయం వీధి వరకు రోడ్డు గుంతలమయమై వాహనచోదకులకు, పాదచారులకు నరకప్రాయంగా మారింది. శుక్రవారం నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి గోతులకు మరమ్మతులు చేపట్టారు. దీంతో వాహన చోదకులకు కొంత ఊరటనిచ్చింది.

ఇసుక అక్రమ రవాణా

బుచ్చిరెడ్డిపాళెం (ఆంధ్రజ్యోతి): మినగల్లు, జొన్నవాడ రీచ్‌ల నుంచి రాత్రివేళల్లో ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. శుక్రవారం రాత్రి 7 గంటల నుంచే పలువురు ఇసుక తోలకందారులు ట్రాక్టర్లతో గట్టుచప్పుడు కాకుండా ఇసుకను తరలించారు. ఇంత జరుగుతున్నా అధికారులెవరూ అటువైపు కన్నెత్తి చూడలేదు. కాగా, అధికార పార్టీ నాయకులకు చెప్పే తాము ఇసుక తరలిస్తున్నట్టు తోలకందారులు చెప్పడం గమనార్హం.

పిడుగుపాటుకు ఇద్దరు కూలీల మృతి



మృతదేహాన్ని పొలం నుంచి మంచంపై మోసుకొస్తున్న సహచర కూలీలు




మృతి చెందిన మణి, రాము

పిచ్చాటూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు మండలం హనుమంతాపురం వ్యవసాయ పొలాల్లోని ఇద్దరు కూలీలు పిడుగుపాటుకు మృతిచెందారు. ఆ గ్రామానికి చెందిన దామోదరం పొలంలో కూలి పని చేయడానికి అదే గ్రామం అరుంధతివాడకు చెందిన మణి(54), రాము(59) శుక్రవారం వెళ్లారు. మధ్యాహ్నం గాలి వాన, ఉరుముల శబ్దాలకు భయాందోళన చెంది పొలం నుంచి బయటకు వస్తున్నారు. ఆ సమయంలో పిడుగు పడటంతో వీరిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. వీరిద్దరి మృతదేహాలను సహచర కూలీలు పొలాల నుంచి మంచంపై గ్రామానికి మోసుకొచ్చారు. మణికి భార్య, ముగ్గురు కుమారులు ఉండగా.. రాముకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. వీరిద్దరి మృతితో ఆ గ్రామంలో విషాదం నెలకొంది.

భూమికి పచ్చాని చీర

ముసురు వానలు తెచ్చిన అందం ఇది. చెట్టూచేమా చిగురించింది. పొలాలన్నీ పచ్చని తివాచీ పరిచినట్లుగా మారాయి. మబ్బూ ఎండా దోబూచులాడాయి. తెల్లని కొంగలు ఆకాశంలో బారులు తీరాయి. పెళ్లకూరు మండలం జీలపాటూరు నుంచి దొడ్లవారిమిట్టకు వెళ్లే తోవలో శుక్రవారం కనిపించిన కమనీయ దృశ్యం ఇది.

- పెళ్లకూరు, ఆంధ్రజ్యోతి



ఛ్ఛ... ఏం బాగోలేదు!

ఆంధ్రజ్యోతి విజిట్



పాండురంగయ్యగారిపల్లిలో 104 వాహనం వద్ద వైద్యులు లేకుండా సిబ్బందే విధులు నిర్వర్తిస్తున్న దృశ్యం



గ్రామ సచివాలయ భవనంలోని ఒక గదిలో నడుస్తున్న కొటాల పీహెచ్‌సీ

జిల్లాలో పీహెచ్‌సీలకు సుస్తీ చేసింది. పలుచోట్ల వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే.. కొన్నిచోట్ల మౌలిక వసతులు సరిగా లేవు. దీనికి సీఎం సొంత మండలంలోని కొటాల పీహెచ్‌సీ కూడా మినహాయింపేమీ కాదు. శుక్రవారం జిల్లావ్యాప్తంగా ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ చేపట్టిన పరిశీలనలో వెల్లడైన వాస్తవాలిలా ఉన్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

- సచివాలయం గదిలో కొటాల పీహెచ్‌సీ
- ఇద్దరు డాక్టర్లూ విధులకు గైర్హాజరు
- సీఎం సొంత మండలంలో ఆరోగ్య కేంద్రం తీరు
- జిల్లాలో పీహెచ్‌సీలకు సుస్తీ
- 'ఆంధ్రజ్యోతి విజిట్'లో వెలుగు చూసిన సమస్యలు

కొటాల.. ఏంటిలా

ఈ చిత్రం చూడండి. డాక్టర్లు కూర్చుని రోగులకు వైద్య సేవలందించాల్సిన చోట ఇద్దరు స్టాఫ్ నర్సులు, అటెండరు ఉన్నారు. వీరే డాక్టర్ విధులను నిర్వర్తిస్తున్నారు. శుక్రవారం కొటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించినపుడు కనిపించిన దృశ్యమిది. ఇద్దరు డాక్టర్లున్నా ఆరోగ్య కేంద్రానికి రాలేదు. అక్కడికి సమీపంలోని పాండురంగయ్యగారిపల్లిలో 104 వాహనం ద్వారా వైద్య సేవలందిస్తున్నారని సిబ్బంది చెప్పారు. అక్కడా సిబ్బంది తప్ప డాక్టర్లు కనిపించలేదు. ఈ పీహెచ్‌సీకి ఏడేళ్లుగా సొంత భవనం లేదు. తొలుత హైస్కూలు భవనంలో నడవగా ప్రస్తుతం గ్రామ సచివాలయ భవనంలోని ఓ గదిలో నిర్వహిస్తున్నారు. ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, ఎక్స్‌రే టెక్నీషియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. టెక్నీషియన్లను నియమించినా పని చేయడానికి ల్యాబ్ గానీ, పరికరాలు గానీ, ఎక్స్‌రే యూనిట్ గానీ లేవు. చివరికి సిబ్బంది సమీక్షా సమావేశాలు సైతం ఈ చిన్నగదిలో జరిపే వీల్లేక.. చంద్రగిరి ప్రభుత్వాస్పత్రికి వెళుతుంటారు. ఇంతకీ చెప్పలేదు కదా.. ఈ కొటాల పీహెచ్‌సీ ఉన్నది మరెక్కడో కాదు. సాక్షాత్తూ సీఎం చంద్రబాబు సొంత మండలమైన చంద్రగిరి పరిధిలో. ఆయన స్వగ్రామమైన నారావారిపల్లెకు ఐదు కిలోమీటర్ల చేరువలో.





ఓపీలో రోగులకు చీటీలు రాస్తున్న టెక్నీషియన్

టెక్నీషియన్‌కు పనేదీ?

డక్కిలి పీహెచ్‌సీలో రెండు గంటలు ఆలస్యంగా 10 గంటలకు స్టాఫ్ నర్సు హాజరయ్యారు. ఎక్స్‌రే టెక్నీషియన్ ఓపీలో రోగులకు చీటీలు రాస్తూ కనిపించారు. ఆరా తీస్తే ఎక్స్‌రే టెక్నీషియన్ పోస్టు ఉండటంతో ఆయన్ను నియమించారు అయితే ఆయన పనిచేయడానికి ఎక్స్‌రే పరికరాలు మాత్రం లేవు. దీంతో ఖాళీగా ఉండటం ఎందుకని ఓపీలో రోగులకు చీటీలు రాస్తున్నారు.

వానొస్తే బకెట్ పెట్టాల్సిందే



ఇది బాలాయపల్లి పీహెచ్‌సీలోని ప్రసూతి గది. పైకప్పు దెబ్బతినడంతో వర్షానికి ఉరుస్తోంది. అందుకే నీళ్లు కారుతున్న చోట ఇలా బకెట్ పెట్టారు. పైకప్పు మొత్తం బలహీనపడిపోయి కాంక్రీటు పెచ్చులూడి పడుతున్నాయి. వ్యాక్సిన్ నిల్వ ఉంచిన గదిలోనూ ఇదే పరిస్థితి.

జయంపు వైద్యురాలికి బాలాయపల్లిలో డ్యూటీ

బాలాయపల్లి నుంచి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న జయంపు గ్రామంలో ప్రభుత్వం ఏడాదన్నర కిందట పీహెచ్‌సీ మంజూరు చేసింది. భవనాల నిర్మాణానికి నిధులు మంజూరైనా నిర్మాణం మొదలు కాలేదు. భవన వసతి లేకపోవడంతో ఒక డాక్టర్ పోస్టు మాత్రమే మంజూరైంది. ఇక్కడ మహిళా వైద్యురాలిగా నియమితులైన వియోనా.. ఏడాదిగా బాలాయపల్లి పీహెచ్‌సీలోనే విధులు నిర్వర్తిస్తున్నారు.

అరువుపై మందులు

వెంకటగిరి మండలం బంగారుపేట పీహెచ్‌సీలో పాముకాటుకు మందు అందుబాటులో లేదు. రోగుల సంఖ్య ఎక్కువ కావడంతో నెలవారీ కేటాయిస్తున్న మందులు సరిపోవడం లేదు. దీంతో ఇరుగుపొరుగు పీహెచ్‌సీల నుంచి అరువుపై మందులు తెప్పించుకుంటున్నారు. ఇక్కడ ముగ్గురు డాక్టర్లు ఉండగా.. ఒకరు పొరుగు నియోజకవర్గంలో ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా అదనపు విధులు నిర్వర్తిస్తున్నారు. స్టాఫ్ నర్సులు నలుగురు వుండగా ఒకరు నెల్లూరు జిల్లా మనుబోలులో డెప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు ఖాళీగా వుంది. దీంతో వారంలో మూడు రోజుల పాటు జీకేపల్లి పీహెచ్‌సీ నుంచీ టెక్నీషియన్ డెప్యుటేషన్‌పై వచ్చి వెళుతున్నారు.

చిన్నతోటలో రెండు డాక్టరు పోస్టులూ ఖాళీ

వాకాడు మండలంలో బాలిరెడ్డిపాలెం, నిడిగుర్తి, చిన్నతోటలో పీహెచ్‌సీలు ఉన్నాయి. నిడిగుర్తి పీహెచ్‌సీలో మాత్రమే రెండు డాక్టర్ పోస్టులూ భర్తీ అయ్యాయి. చిన్నతోట పీహెచ్‌సీలో రెండు పోస్టులూ ఖాళీగా వున్నాయి. దీంతో కోట నుంచి ఒకరు, చిట్టమూరు నుంచి ఒకరు చొప్పున డిప్యుటేషన్ మీద డాక్టర్లు వచ్చి వెళుతున్నారు. మూడు స్టాఫ్ నర్సు పోస్టుల్లో ఒకటి ఖాళీగా వుంది. ఇక బాలిరెడ్డిపాలెంలో రెండు డాక్టర్ పోస్టులకు గానూ ఒకటి ఖాళీ. అక్కడికి కూడా కోట నుంచీ డాక్టర్ ఒకరు డెప్యుటేషన్‌పై విధులకు వస్తున్నారు.

ఈ పీహెచ్‌సీలలో ల్యాబ్ పరీక్షలకు ఇక్కట్లు

చిట్టమూరు పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్ లేరు. దీంతో మల్లాం నుంచి డెప్యుటేషన్‌పై వచ్చి వెళుతున్నారు. దొరవారిసత్రం పీహెచ్‌సీ లేబొరేటరీలో పరికరాలు వుండి పనిచేస్తున్నా కూడా ల్యాబ్ టెక్నీషియన్ రోగులను ప్రైవేటు ల్యాబ్‌లకు పంపిస్తున్నారనే ఆరోపణలున్నాయి. సూళ్ళూరుపేట మండలం పేర్నాడు పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్ లేరు. రోగులకు అసౌకర్యంగా వుంది. పరికరాలున్నా టెక్నీషియన్ లేనందున ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది. తిరుపతి ముత్యాలరెడ్డిపల్లి అర్బన్ పీహెచ్‌సీలో ల్యాబ్‌లో పరీక్షలకు అవసరమైన మెటీరియల్ ఈ నెల స్టాక్ ఇంతవరకూ సరఫరా కాలేదు. వెంకటగిరి మండలం జీకేపల్లి పీహెచ్‌సీలో ల్యాబ్, పరికరాలున్నా టెక్నీషియన్ పోస్టు ఖాళీగా వుంది.



సూళ్ళూరుపేట మండలం పేర్నాడు పీహెచ్‌సీలో టెక్నీషియన్ లేక నిరుపయోగంగా ఉన్న ల్యాబ్

వడమాలపేటలో ముఖ్యమైన మందుల కొరత

వడమాలపేట పీహెచ్‌సీలో డాక్టర్ పోస్టులు రెండుంటే ఒక్కటి ఖాళీగా ఉంది. మూడు స్టాఫ్ నర్సు పోస్టులూ లు మూడుండగా మూడూ ఖాళీగా వున్నాయి. దీంతో ఇద్దరు నర్సులు కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్నారు. ల్యాబ్‌లో టైఫాయిడ్ జ్వరాన్ని నిర్ధారించే పరీక్షలు చేయడం లేదు. దానికి సంబంధించిన మెటీరియల్ సరఫరా కావడం లేదు. ఇక మందులు చాలావరకూ అందుబాటులో వున్నప్పటికీ ఆరు రకాల ముఖ్యమైన మందులు మాత్రం 20 రోజులుగా లేవు.

స్టోర్ రూమ్‌గా మారిన శస్త్ర చికిత్సల గది

తిరుపతికి చేరువగా వున్న రేణిగుంట ఓ మోస్తరు పట్టణం. అక్కడి పీహెచ్‌సీలో చిన్నా చితకా శస్త్ర చికిత్సల కోసం ఏర్పాట్లు వున్నాయి. అయితే శస్త్రచికిత్సలు జరగకపోవడంతో దానికోసం ప్రత్యేకంగా కేటాయించిన గదిని సిబ్బంది స్టోర్ రూమ్‌గా వాడుకుంటున్నారు.

ఓ ప్రమాద ఘటన గురించి పోలీసులకు ఇచ్చిన సమాచారమే..
అతడిని మృత్యువు రూపంలో వెంటాడింది. పోలీసుల సూచనతో ప్రమాద స్థలం చూపేందుకు వెంట వెళ్లిన వాచర్ వెంకటేష్..
మరో వాహనం ఢీకొనడంతో మృత్యుఒడికి చేరారు. తొట్టంబేడు మండలంలో గురువారం అర్ధరాత్రి ఈ విషాద ఘటన చోటుచేసుకుంది.

ప్రమాద స్థలం చూపేందుకు వెళ్లి..!

- వాహనం ఢీకొనడంతో ఫారెస్టు ప్రొటెక్షన్ వాచర్ దుర్మరణం



ప్రమాదంలో దెబ్బతిన్న వాహనం - ఇన్‌సెట్‌లో వెంకటేష్ (పాతచిత్రం)

శ్రీకాళహస్తి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఫారెస్టు ప్రొటెక్షన్ వాచర్ వెంకటేష్ (32) దుర్మరణం చెందారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి తెలిపిన ప్రకారం.. తొట్టంబేడు మండలం బసవయ్యపాళెం ఎస్టీకాలనీకి చెందిన వెంకటేష్, అటవీశాఖలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి. ఇదే గ్రామంలోని చెక్‌పోస్టులో పనిచేసేవారు. గురువారం అర్ధరాత్రి కన్నలి గ్రామం వద్ద వెంకటేష్ విధులకు హాజరయ్యారు. అర్ధరాత్రి దాటాక విజయవాడ నుంచి కర్ణాటకకు వెళుతున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సును.. ఎదురుగా కర్రలలోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ ఓవైపు తగలడంతో స్వల్ప ప్రమాదం సంభవించింది. దీనిపై ఫారెస్టువాచర్ వెంకటేష్ హైవే పెట్రోల్ పోలీసులకు సమాచారమిచ్చారు. రక్షక్ వాహనంలో ఓ కానిస్టేబుల్, హోంగార్డుతో కలిసి వచ్చారు. వెంకటేష్ కూడా ప్రమాద స్థలాన్ని చూపించేందుకు వెంట వెళ్లారు. కట్టెలలోడ్‌తో ఉన్న ట్రాక్టర్ డ్రైవర్‌తో మాట్లాడుతుండగా ఓ మినీలారీ వారిపై దూసుకెళ్లింది. ఈ ఘటనలో కానిస్టేబుల్, హోంగార్డు స్వల్పగాయాలతో బయటపడ్డారు. రక్షక్ వాహనంలో ఉన్న వెంకటేష్ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సిబ్బందితో కలిసి డీఎస్పీ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదాన్ని పరిశీలించారు. వెంకటేష్ మృతదేహాన్ని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిరుపేద ఎస్టీ కుటుంబానికి చెందిన వెంకటేష్‌కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఎస్టీ కాలనీలో తీవ్ర విషాదం నెలకొంది.

సఫాయి కరంచారి కమిషన్ చైర్మన్ రాక

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మూడురోజుల పర్యటన నిమిత్తం జాతీయ సఫాయి కరంచారి కమిషన్ చైర్మన్ ఎం.వెంకటేశన్ శుక్రవారం జిల్లాకు వచ్చారు. రాత్రి తిరుపతిలో బస చేసిన ఆయన శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారు. మధ్యాహ్నం తిరుపతిలోని తుడా కార్యాలయంలో అధికారులతో పాటు పారిశుధ్య కార్మికులతో సమావేశమవుతారు. రుయా, స్విమ్స్‌లోనూ పారిశుధ్య కార్మికులతో సమావేశం నిర్వహిస్తారు. 20వ తేది ఉదయం ఢిల్లీకి తిరుగు పయనం కానున్నారు. ఆయనకు జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి చెన్నయ్య, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికారు.



గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన టీడీఎల్పీ సమావేశంలో పాల్గొన్న చిత్తూరు, తిరుపతి జిల్లాల ఎమ్మెల్యేలు - ప్రసంగిస్తున్న పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు



పండగ సెలవు కోసం..

నరక చతుర్దశిని అధికారిక సెలవుదినంగా ప్రకటించాలన్నది ఈ విద్యార్థుల వినతి. దీనికోసం తిరుపతి నగరం ఎంఆర్‌పల్లె సర్కిల్‌లో శుక్రవారం సాయంత్రం పోస్టుకార్డులను చూపారు. వీటిని సీఎం చంద్రబాబుకు పంపనున్నట్లు హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు మహేష్ డేగల తెలిపారు. గత వైసీపీ పాలనలో హిందూ వ్యతిరేకతతో పండుగ సెలవును రద్దు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఆ సెలవును పునరుద్ధరించాలని కోరారు.

- తిరుపతిరూరల్, ఆంధ్రజ్యోతి

ఎలా పోవాలబ్బా?

వాహనం వస్తే దిగబడుతుంది. ద్విచక్ర వాహనమైతే జారుతుంది. ఇలాంటి రోడ్డులో ఎలా పోవాలబ్బా అంటూ ఆవేదన చెందుతున్నారు ఏర్పేడు మండలం పాగాలి గ్రామస్తులు. శ్రీకాళహస్తి రోడ్డులో నుంచి ఆ ఊరు వెళ్లే 2.5 కిలోమీటర్లు ఇదే పరిస్థితి. 2019కి ముందు టీడీపీ హయాంలో రోడ్డుకు భూమి పూజ చేసినా.. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పట్టించుకోలేదు. దీంతో వర్షమొస్తే నడకయాతన తప్పడం లేదంటున్నారు స్థానికులు.

- ఏర్పేడు, ఆంధ్రజ్యోతి



బాక్స్ క్రికెట్! కుమ్మేసుకోవచ్చు



గేమ్స్ అంటే ఈతరం పిల్లలు మొబైల్‌లో ఆడుకునేవి అనుకుంటారు. ప్రభుత్వ బడుల్లో మైదానాలు అంతరించిపోయి, ఆటస్థలాలు లేని ప్రయివేటు బడుల హవా మొదలయ్యాక ఏర్పడిన దౌర్భాగ్యం ఇది. గుడ్డిలో మెల్లలా క్రికెట్ ఆట ఒక్కటీ ఈతరం పిల్లలను ఆకర్షిస్తూనే ఉంది. ఆసక్తి ఉన్నా, సమయం కుదుర్చుకున్నా ఆడుకునేదానికి స్థలాలు ఏవీ? రియల్‌ఎస్టేట్ కబళించేసిన నగరాల్లో ఇదో పెద్ద సమస్య. ఇందుకు విరుగుడుగా పరిమిత స్థలంలోనే క్రికెట్ ఆడుకునే, నేర్చుకునే మైదానాలు మొదలయ్యాయి. దీన్నే బాక్స్ క్రికెట్ అంటున్నారు. తిరుపతిలో ఆరు బాక్స్‌క్రికెట్ క్లబ్‌లు ఉన్నాయి. గంటకి ఇంతని అద్దె చెల్లించి వీటిలో ఆడుకోవచ్చు. గెస్ట్‌లైన్‌రోడ్డు(అన్నమ్య మార్గ్)లో కొత్తగా సామ్స్ క్రికెట్ క్లబ్ ఏర్పాటు చేశారు. ఈ క్లబ్‌లో 2 క్రికెట్ బాక్సులు అందుబాటులో ఉన్నాయి. యువత టీంలుగా గానీ, కుటుంబాలుగా గానీ ఆడుకోవచ్చు. కాకపోతే ముందుగా టైంస్లాట్ బుక్ చేసుకోవాలి.

- తిరుపతి (జీవకోన)





ప్రత్యేకతలు:

ఈడ్చి కొడితే బాల్ పక్కింటి కిటికీ అద్దాలు బద్దలు చేస్తుందనే భయం లేదు. బాక్స్‌టైప్ నెట్ బాల్‌ను బయటకు వెళ్లనివ్వదు.
రాత్రి వేళల్లోనూ ప్రత్యేక లైట్ల వెలుగులో క్రికెట్ ఆడుకోవచ్చు.

అద్దె ఎంత?:

పగలైతే గంటకు రూ.650.
రాత్రి అయితే రూ.850.
(15శాతం దాకా డిస్కౌంట్ వెసులుబాటు ఉంది)
వివరాలకు: 9059268386



ముగింపు దశలో ముక్కంటి ఆలయ లీకేజీ పనులు

● దాతృత్వం చాటుకున్న పుణె వ్యాపారి



శ్రీకాళహస్తి, అక్టోబరు 18: శ్రీకాళహస్తీశ్వరాలయ పైకప్పు లీకేజీని అరికట్టే పనులు ముగింపు దశగా వచ్చాయి. కొద్ది సంవత్సరాలుగా ముక్కంటి ఆలయ పైకప్పు లీకేజీ ఏర్పడటంతో సమస్య నెలకొంది. మైసూరులోని జాతీయ పురావస్తుశాఖ డైరెక్టర్ మునిరత్నంరెడ్డి ముక్కంటి ఆలయ లీకేజీలపై స్పందించారు. పుణెకు చెందిన వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు వెంకటేశ్వరరావును లీకేజీ పనులను చేపట్టాల్సిందిగా సూచించారు. దీంతో ఏడాది క్రితం చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు పుణెకు చెందిన ఐఐటీ నిపుణుల బృందంతో పలుదఫాలుగా అధ్యయనం చేయించారు. అత్యంత శాస్త్రీయమైన పురాతన శైలిలో పైకప్పునకు మరమ్మతులు చేసేందుకు రెండు నెలల క్రితం దాత పనులు ప్రారంభించారు. నిపుణుల పర్యవేక్షణలో సున్నం, ఇటుకలపొడి, ఇటుక ముక్కలు, ప్రకృతిలో సహజసిద్ధంగా మొక్కల నుంచి సేకరించిన బంక, కరక్కాయపొడి తదితర మిశ్రమాలతో పనులు చేపట్టారు. సుమారు రూ.5కోట్లతో చేపట్టిన ఈ పనులు తుదిదశకు చేరాయి. ఆయన కృషి ఫలితంగా ఇటీవల నాలుగు రోజుల పాటు ఎడతెరపిలేకుండా వర్షాలు కురిసినప్పటికీ ఎక్కడా లీకేజీ కనపడలేదు.



పంచాయతీ పరిధిలో జీప్లస్ టూ వరకే నిర్మించాలి. ఆపై కట్టాలంటే తుడా అనుమతి తీసుకోవాలి. అలాగని ఈ ప్రాంతంలో భవంతుల నిర్మాణానికి దరఖాస్తు చేసుకుంటే.. తుడా అనుమతివ్వదు. ఎందుకంటే ఇది హథీరాంజీ మఠం భూములు. అయినా, నిబంధనలకు విరుద్ధంగా తిరపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీ తిరుమలనగర్‌లోని మఠం భూముల్లో కళ్లు చెదిరే బహుళ అంతస్థు నిర్మాణాలు చేపడుతున్నారు.

మఠం భూముల్లో బహుళ అంతస్థులు

● నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు.. పట్టించుకోని అధికారులు



గాంధీపురం పంచాయతీ పరిధిలో సర్వే నెంబరు 13 లో దాదాపు వంద ఎకరాల విస్తీర్ణంలో మఠం భూమిఉంది. ఈ భూమిలో నిబంధనలకు విరుద్ధంగా కమర్షియల్ తరహా పలు అపార్టుమెంట్లు, పెద్దపెద్ద నివాస భవంతులను నిర్మిస్తున్నారు. గతంలో ఈ భూమిని పలువురు రైతులు మఠం నుంచి 99 సంవత్సరాలకు కౌలుకు తీసుకుని వ్యవసాయం సాగుచేసేవారు. తమకు సాగు అనుభవం ఉండడంతో అప్పట్లో కొందరు రైతులు హైకోర్టును ఆశ్రయించి రిజిస్ట్రేషన్ ఉత్తర్వులు తెచ్చుకున్నారు. తర్వాతకాలంలో హైకోర్టు ఈ భూముల్లో రిజిస్ట్రేషన్లు చేపట్టకుండా ఉత్తర్వులను రద్దు చేసినట్లు సమాచారం. ఈసీలో కూడా ఇప్పటికీ హథీరాంజీమఠం భూమిగానే నమోదై ఉంది. ఈ స్థలంలో శాశ్వత భవన నిర్మాణాలు చేపట్టేందుకు పంచాయతీకి అనుమతిచ్చే అధికారం లేదు. అయితే నీరు, లైట్లు, రోడ్లు పంచాయతీవి కావడంతో కొంత మంది నుంచి గతంలో డెవలప్‌మెంట్ ట్యాక్స్ కట్టించుకున్నట్లు తెలిసింది. ఈ భూమిలో తొలుత రేకులషెడ్లు నిర్మించుకున్న కొందరు.. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజకీయ పలుకుబడితో ఒత్తిడి తెచ్చి పంచాయతీ డెవలప్‌మెంట్ ట్యాక్స్‌తోపాటు విద్యుత్ మీటర్లనూ తీసుకున్నారని సమాచారం. అదే స్థలంలో పెద్ద భవంతులు నిర్మించాక నాలుగేళ్లుగా ఎటువంటి రివైజ్డ్ ట్యాక్స్ కూడా చెల్లించని పరిస్థితి ఉంది. ఇప్పటికీ ట్యాక్స్ రూపంలో పలువురు వేలాదిరూపాయలు బకాయి ఉన్నారు. దీనికి తోడు కొత్తగా చేపట్టిన దాదాపు 40శాతం వరకు నిర్మాణాలకు ఇప్పటికీ పూర్తిగా పంచాయతీ ట్యాక్స్ కూడా చెల్లించలేదని తెలిసింది. తిరుపతినగరపరిధి దాదాపుగా రూరల్‌మండలం వరకు విస్తరించడంతో ఈభూములకు విపరీతమైన డిమాండు ఉంది. దీంతో రైతులు మఠం వద్ద కౌలుకు తీసుకున్న ఈ భూములను పలువురికి విక్రయాలు చేపట్టారు. రైతుల నుంచి పలువురు ఈభూములను కొనుగోళు చేసి భారీ నిర్మాణాలను చేపడుతున్నారు. మఠం భూమి కావడంతో ఇళ్ల నిర్మాణాల అప్రూవల్‌కు అవకాశమే లేదు. అయితే ఈభూమిలో వివిధ రంగాలకు(రాజకీయ, రెవెన్యూ, పోలీసు తదితర) చెందిన వారు నిర్మాణాలు చేపట్టడంతో మఠం, పంచాయతీ అధికారులు ఇటువైపు చూడటం లేదు. అదే పేదలు ఎక్కడో మారుమూల రెండుసెంట్ల స్థలం కొనుగోళు చేసి నిర్మాణాలు చేపడితే వెంటనే వచ్చి కూలదోసే మఠం అధికారులు విలువైన భూములు అన్యాక్రాంతమవుతున్నా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం విమర్శలకు దారితీస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా ఆపార్టీకి చెందిన కొందరు ద్వితీయ శ్రేణి నేతల కన్ను ఈభూమిపై పడింది. ఇతరుల అధీనంలో ఉన్నభూమిలో దౌర్జన్యంగా ప్రవేశించి ఆక్రమణలకు దిగుతున్నారన్న ప్రచారం జరుగుతోంది.

- తిరుపతిరూరల్, ఆంధ్రజ్యోతి

'పులికాట్'లో ఒరిగిన టవర్



నిటారుగా నిలబడాల్సి ఈ విద్యుత్తు టవర్.. ఏడాది ఒరిగిపోయి ఉంది. ఇరకం దీవికి విద్యుత్తు సరఫరా కోసం పులికాట్ సరస్సులో రెండు టవర్ల ఏర్పాటు చేశారు. వీటిలో ఒకటి గతేడాది మీచౌంగ్ తుఫాన్ సమయంలో వీచిన గాలులకు పక్కకు ఒరిగిపోయింది. అప్పట్నుంచి అలా.. ఉండిపోయింది. ఇటీవల వాయుగుండం ముప్పు తప్పింది కాని.. పెనుగాలులు వీచుంటే ఈ టవర్ నేలవాలేదే. ఇప్పుడు వానలు.. తుఫాన్లు ఎక్కువగా ఉంటాయి. ఈ క్రమంలో విద్యుత్తు టవరు కిందకు ఒరిగిపోతే ప్రమాదమే. మరోవైపు ఇరకం దీవికి విద్యుత్తు సరఫరా కూడా నిలిచిపోతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ టవర్‌ను స్థిరంగా నిలబెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

- తడ, ఆంధ్రజ్యోతి

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.69 కోట్లు

తిరుమల, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.69 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించింది. ఈమేరకు రూ.3.96 కోట్లు ఆదాయం లభించినట్లు టీటీడీ శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక గురువారం 58,637 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 21,956 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.



సదరన్ డిస్కం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

విద్యుత్ చార్జీలు పెంచకండి

తిరుపతి (ఆటోనగర్) అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సర్దుబాటు నెపంతో విద్యుత్ చార్జీలు పెంచరాదని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం ఎదుట శుక్రవారం సీపీఎం జిల్లా కమిటీ అధ్వర్యంలో ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ కొనుగోలు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం సర్దుబాటు చార్జీలు పెంచి, ఆ భారాన్ని వినియోగదారులపై మోపాలని చూస్తోందన్నారు. రాష్ట్రంలోని మూడు విద్యుత్ పంపిణీ సంస్థలు 2022-23 వార్షికానికి సంబంధించి సర్దుబాటు చార్జీలు పెంచాలని విద్యుత్ నియంత్రణ మండలికి ప్రతిపాదనలు పంపినప్పటికీ ఆ సమయంలో ప్రజాభిప్రాయం ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. వినియోగదారుల ప్రయోజనాలు కాపాడాల్సిన నియంత్రణ మండలి నేటి వరకు కాలయాపన చేసి ఇప్పుడు ట్రూఅప్ చార్జీలు పెంచాలని నిర్ణయం తీసుకోవడం ఏమిటని నిలదీశారు. తొందరపాటు చర్యలతో వినియోగదారులపై భారం మోపాలని చూస్తే ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం సదరన్ డిస్కం సీఎండీ కె.సంతోషరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జయచంద్ర, సాయిలక్ష్మి, ఆర్.లక్ష్మి, కె.వేణుగోపాల్, టి.సుబ్రమణ్యం, నరేంద్ర, చిన్నబాబు పాల్గొన్నారు.

మద్యం షాపుల యజమానులెవరు?



కొత్తగా ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణాల వివరాలు సేకరిస్తున్న పోలీసులు

● వివరాలు సేకరిస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం) అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల యజమానుల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. జిల్లాలో 227 మద్యం దుకాణాలకు గాను శుక్రవారం వరకు దాదాపు 210 ప్రారంభమయ్యాయి. ఆయా మద్యం షాపులను ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారు? వాటి యజమానులు ఎవరు? ఏ ప్రాంతానికి చెందిన వారు? వారి ఆధార్ వివరాలు.. గతంలో పోలీసు కేసులు ఏవైనా ఉన్నాయా అన్న కోణంలో సమగ్రంగా వివరాలు సేకరిస్తున్నారు. వీటిని ఆన్‌లైన్‌లో ఉంచి అవసరమైన సమయాల్లో ఏదైనా అనుకోని ఘటనలు జరిగితే దానికి సంబంధిత దుకాణాలు యజమానులను బాధ్యులుగా చేయడానికి అవకాశం వుంటుందని పోలీసులు చెబుతున్నారు. అన్ని మద్యం దుకాణాలను సంబంధిత పోలీసు స్టేషన్లతో అనుసంధానం చేసే ప్రక్రియను త్వరలో ప్రారంభించనున్నారు.

స్క్రిప్టులో 'రాజుగారి గది 4'



ఓంకార్, అశ్విన్

'రాజు గారి గది4' సినిమా స్క్రిప్ట్ వర్క్ జరుగుతోందని దర్శకుడు ఓంకార్ తెలిపారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం ఉదయం తన తమ్ముడు, హీరో అశ్విన్‌తో కలిసి దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. 'ఇస్మార్ట్ జోడీ3', 'డ్యాన్స్ ఐకాన్2' షోలు త్వరలో ప్రారంభించనున్నట్టు తెలిపారు. తాను నటించిన ఓ చిత్రం షూటింగ్ ఇప్పటికే పూర్తయిందని, త్వరలోనే ఆ వివరాలు వెల్లడిస్తామని అశ్విన్ చెప్పారు.

శ్రీవారి సేవలో అషిక



తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని శుక్రవారం సినీనటి అషిక రంగనాథ్ దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో ఆమె స్వామి సేవలో పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

పారిశ్రామికాభివృద్ధికి సహకరించండి: కురుగొండ్ల


మంత్రి సత్యప్రసాద్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, అక్టోబరు 18:(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు సహకరించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కోరారు. శుక్రవారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశానికి హాజరైన రామకృష్ణ పలువురు మంత్రులను కలిశారు. డక్కిలి మండలం ఆల్తూరుపాడులో రూ.540 కోట్ల వ్యయంతో ప్రారంభించిన రిజర్వాయరు నిర్మాణ పనులను తిరిగి పునరుద్ధించాలని కోరారు. రిజర్వాయరు నిర్మాణంలో 120 ఎకరాలు అటవీ భూములు కలుస్తున్నాయని, అటవీశాఖకు ప్రత్యామ్నాయంగా రెవెన్యూ భూములు కేటాయింపు జరగాలని మంత్రి అనగానిని కోరారు. అదేవిధంగా నియోజకవర్గంలో అటవీ పోరంబోకు, రెవెన్యూ భూములు విస్తారంగా వున్నాయని, వాటిని గుర్తించి పరిశ్రమల స్థాపనకు రిజర్వు చేయాలని కోరారు. ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణ పనులు త్వరగా ప్రారంభం అయ్యేలా చూడాలని ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడికి కురుగొండ్ల విజ్ఞప్తి చేశారు.

లింగనిర్ధారణ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా

గూడూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గర్భస్థపిండ లింగనిర్ధారణ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా అన్నారు. శుక్రవారం సబ్‌కలెక్టర్ తన కార్యాలయంలో గర్భస్థపిండ లింగనిర్ధాణ చట్టం అమలుపై అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేనన్నారు. ఆడపిల్లల పట్ల వివక్షత చూపడకూడన్నారు. గర్భస్థపిండ లింగనిర్ధాణ చట్టాన్ని కఠినంగా అమలు చేయడం ద్వారా భ్రూణహత్యలను నివారించవచ్చునన్నారు. వైద్యాధికారులు ప్రతినెలా స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేసి చట్టాన్ని అతిక్రమించిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల్లో కూడా ఈ చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మావతి, బాబు నెహ్రూరెడ్డి, మెహబూబీ పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రమణ

వెంకటగిరి టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): యువత సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ రమణ అన్నారు. శుక్రవారం స్థానిక అమరావతి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పరిచయం వ్యక్తులు వోటీపీ అడిగితే చెప్పకూడదన్నారు. మొబైల్ పాస్‌వర్డు గోప్యంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సత్కారం


విద్యార్థినిని సత్కరిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

దొరవారిసత్రం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని వి.నిరోషా గత నెలలో న్యూఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి సైన్సు ఎగ్జిబిషన్ ఇన్‌స్పైయర్ మనక్‌లో ప్రతిభ కనబరిచింది. నిరోషా తయారు చేసిన ట్రాలీ ఫర్ సీవేజ్ క్లీనింగ్ యంత్రం ఉత్తమ ప్రదర్శనగా నిలిచింది. శుక్రవారం ఎంఈవో కృష్ణయ్య ఉపాధ్యాయులతో కలిసి నిరోషాను సత్కరించారు. భవిష్యత్‌లో మంచి శాస్త్రవేత్తగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నట్టల నివారణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

గూడూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నట్టలనివారణ కార్యక్ర మాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ సురేష్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో, మండలంలోని కొండాగుంట గ్రామంలో గొర్రెలకు, మేకలకు నట్టలనివారణ మందులు తాగించారు. కార్యక్రమంలో శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది, పాడిరైతులు పాల్గొన్నారు.

మానమాలలో గ్రామసభ

ఓజిలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం మానమాలలో శుక్రవారం తహసీల్దారు పద్మావతి ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. రెవెన్యూ సమస్యలపై స్థానికులు వినతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ విజయకుమార్, సర్వేయర్ లక్ష్మీనారాయణ వీఆర్వో మస్తాయ్య, టీడీపీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్ నాయుడు, నాయకులు కొండూరు సుబ్రహ్మణ్యంరాజు, వెంకటేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

డీకేటీ భూములకు పరిహారం ఇవ్వండి

కోట,అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): డీకేటీ భూములకు పరిహారం చెల్లించే విషయంలో తమకు న్యాయం చేయాలంటూ మండలంలోని కొత్తపట్నం పంచాయతీ గున్నంపడియ రైతులు శుక్రవారం తహసీల్దారు జయజయరావుకు వినతిపత్రం అందజేశారు. కొత్తపట్నం రెవెన్యూలోని డీకేటీ భూములను ఏపీఐఐసీ సెజ్‌కు తీసుకున్నందున పరిహారం అందించాలని కోరారు.

డిస్లెక్సియాపై అవగాహన ర్యాలీ

సూళ్లూరుపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని భవిత కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై అవగాహన ర్యాలీ చేపట్టారు. భవిత కేంద్రం సహిత విద్య ఉపాధ్యాయురాలు భార్గవి ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాల నుంచి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థుల అభ్యసనలో ఐదు రకాల లోపాలు ఉంటాయని, వాటిని ప్రత్యేక శిక్షణ ద్వారా సరిదిద్దవచ్చన్నారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, భవిత కేంద్ర సిబ్బంది సాయి సంధ్య, సుజాత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

22నుంచి 25 వరకు ఆధార్ క్యాంపులు

గూడూరు అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 22నుంచి 25వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని నరసింగరావుపేట, మాళవ్యా నగర్, ఇందిరానగర్, చెన్నూరు సచివాలయాల్లో ఆధార్‌కార్డుల సవరణ, నూతన కార్డుల జారీకి ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎన్టీఆర్ వైద్యసేవ సిబ్బంది సమ్మెకు పిలుపు

ఓజిలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవ ఉద్యోగుల సమస్యల సాధన కోసం ఈనెల 29 నుంచి సమ్మెకు పిలుపునిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి సుమన్ శుక్రవారం తెలిపారు.


సాగరమాల రోడ్డు నిర్మాణంలో భాగంగా కడతూము వద్ద చేపట్టిన ఫ్లైఓవర్ - కడతూము వద్ద పూడిపోయి రూపురేఖలు మారిన పంటకాలువ

సాగరమాల రోడ్డు నిర్మాణంతో పూడిపోతున్న పంటకాలువలు

- ప్రశ్నార్థకంగా మారనున్న సాగు
- ఆందోళన చెందుతున్న రైతులు

చిల్లకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలంలో వరగలిక్రాస్ రోడ్డు నుంచి తమ్మినపట్నం వరకు సుమారు 40 కిలోమీటర్ల మేర సాగరమాల రోడ్డు నిర్మాణం జరుగుతోంది. ఇందులో భాగంగా వరగలి క్రాస్ రోడ్డు నుంచి సమీపంలోని పెట్రోల బంకు వరకు ఫ్లైఓవర్ నిర్మాణం జరుగుతోంది. దీని వల్ల సమీపంలోని కడతూముతో పాటు పంట పొలాలకు సాగునీరు అందించే పంట కాలువ పూడిపోయింది. కడతూము కింద సుమారు 160 ఎకరాల వరకు చిల్లకూరు రైతులు సాగు చేస్తున్నారు. చిల్లకూరు చెరువు నుంచి పంట కాలువ ద్వారా కడతూము నుంచి జాతీయ రహదారి సమీపంలోని పొలాలకు సాగు నీరు చేరుతుంది. అయితే సాగరమాల రోడ్డు నిర్మాణంలో భాగంగా వరగలి క్రాస్ రోడ్డు సమీపంలోని జాతీయ రహదారి వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ వల్ల కడతూము నుంచి వచ్చే పంటకాలువ పూర్తిగా పూడిపోగా, కడ తూము కొంతమేర పూడిపోయింది. జాతీయ రహదారి నిర్మాణం చేపట్టిన సమయంలో పొలాలకు సాగుకు నీరు వెళ్లడానికి ఇబ్బందులు కలగ కుండా కడతూము వద్ద కల్వర్టు ఏర్పాటు చేసి దానిపై రోడ్డు నిర్మించారు. అయితే సాగరమాల వంతెన పనులు చేసే సమయంలో మట్టి తోలకం వల్ల కడతూము కొంతమేర పూడిపోయింది. అక్కడి నుంచి వచ్చే పంటకాలువ పూడిపోయి రూపురేఖలు లేకుండా పోయింది. ప్రస్తుతం వర్షాలు కురు స్తున్నా.. పంటకాలువ పూడిపోవడంతో నీటి ప్రవాహం లేక సాగు ప్రశ్నార్థకంగా మారుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.


మేనేజరు, టౌన్ ప్లానింగ్ అధికారి, జూనియర్ అసిస్టెంట్ లేకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

వెంకటగిరి మున్సిపాలిటీలో గాడితప్పిన పాలన..!

- సెలవులో కమిషనర్
- క్యాంపు పేరుతో విధులకు సిబ్బంది డుమ్మా
- కార్యాలయంలో అన్నీ ఖాళీ కుర్చీలే
- ప్రజలకు సమాధానం చెప్పేవారు కరువు


మున్సిపల్ కార్యాలయం - ఖాళీగా వున్న కమిషనర్ సీటు

వెంకటగిరి, అక్టోబరు 18:(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మున్సిపల్ కార్యాలయంలో పాలన గాడి తప్పింది. ఇటీవల మున్సిల్ కమిషనర్ బదిలీపై వెళ్లారు. కొత్తగా వచ్చిన కమిషనర్ నరేంద్ర విధుల్లో చేరిన వెంటనే సెలవుపై వెళ్లడంతో పాలన పడకేసింది. అధికారులు, సిబ్బంది ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళతారో తెలియడం లేదు. వివిధ సమస్యలపై కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయి. మున్సిపల్ ఛైర్‌పర్సన్ మొదలుకొని వార్డు కౌన్సిలర్లు మొత్తం వైసీపీకి చెందిన వారు కావడంతో వారు పాలనపై శ్రద్ధ చూపడం లేదు. దీంతో అక్కడి అధికారులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది సిబ్బంది ప్రతి పనికీ ఓ రేటు కట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చిన్న పని కావాలన్నా రోజుల తరబడి మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిప్పుకొంటున్నారని ఆరోపిస్తున్నారు. పట్టణంలో అక్రమ లే అవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా పట్టించుకొనే నాధుడు కరువయ్యారు. టౌన్ ప్లానింగ్ అధికారి పోస్టు ఖాళీగా ఉండటంతో పట్టణంలో అక్రమ కట్టడాలు యధేచ్ఛగా సాగుతున్నాయి. అలాగే పారిశుధ్య బాధ్యతలు చూస్తున్న ఓ అధికారి చేతివాటం ప్రదర్శస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇదే తరహాలో వెంకటగిరి పోలేరమ్మ జాతర ఖర్చుల పేరుతో లక్షలాది రూపాయల సొమ్ము దారి మళ్లించారే ఆరోపణలు ఉన్నాయి. కమిషనర్ సెలవులో వుండటం కొంతమంది అధికారులకు బాగా కలిసి వచ్చిందని కార్యాలయంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ కార్యాలయంలో మొత్తం 34 మంది అధికారులు, సిబ్బంది పనిచేస్తుంగా కేవలం 16 మంది మాత్రమే పని చేస్తున్నారు. అధికారులు కార్యాలయం విడిచి వెళ్లాలంటే కార్యాలయంలోని మూమెంటు రిజిస్టర్‌లో ఎక్కడకు వెళుతున్నారో రాయాల్సి వుంది. అయితే ఇక్కడ అలాంటి పరిస్థితి లేదు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గూడూరు అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని డీఈ ప్రసాద్ తెలిపారు.

సూళ్లూరుపేట: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సూళ్లూరుపేట తడ, దొరవారిసత్రం మండలాల్లో శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఏ శేఖర్ తెలిపారు. ఉండదన్నారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

కూలిన పీహెచ్‌సీ ప్రహరీ

గూడూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ప్రహరీ ఇటీవల కురిసిన వర్షాలకు కొంత వరకు కూలిపోయింది. దీంతో పీహెచ్‌సీ ఆవరణలోకి పశువులు, జీవాలు వస్తుండడంతో పరసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. అంతేకాకుండా పీహెచ్‌సీ శివారు ప్రాంతం కావడంతో విషసర్పాలు ఆస్పత్రిలోకి వస్తున్నాయని సిబ్బంది చెబుతున్నారు. అధికారులు స్పందించి కూలిన ప్రహరీని నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చిత్రపటాల అందజేత

వాకాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అన్నపూర్ణరావుకు టీడీపీ నాయకులు బల్లి హర్ష, దినకర్‌బాబు సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలను శుక్రవారం అందజేశారు.

రీసర్వే జరిపితే ప్రజాప్రతినిధులకు చెప్పరా?

మీ హయాంలో మాకు చెప్పారా ● రసాభాసగా మండల సమావేశం


మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ భాస్కర్‌రావు

కోట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కోట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దాసరి అంజమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా గృహ నిర్మాణశాఖ ఏఈ భాస్కర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు టీడీపీ హయాంలో ఆగిపోయిన పక్కాగృహాలపై సర్వే చేస్తున్నామని, పెండింగ్ బిల్లులపై దృష్టి పెడతామన్నారు. కొత్తపట్నం ఉప సర్పంచు ప్రసాద్‌గౌడ్ మాట్లాడుతూ అధికారులు సర్వే చేసేటప్పుడు స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వరా అని ప్రశ్నించారు. వెంటనే టీడీపీ నేత, కోట ఎంపీటీసీ దారా సురేష్ జోక్యం చేసుకొని మీ హయాంలో మా ప్రజాప్రతినిధులకు అధికారులు సమాచారం ఇచ్చారా అంటూ ఎదురు ప్రశ్నించారు. దీంతో ప్రసాద్‌గౌడ్, టీడీపీ ఎంపీటీసీలు సురేష్, షంషుద్దీన్ మధ్య కొద్ది సేపు వాదోపవాదాలు జరిగాయి. అనంతరం అధికారులు శాఖల వారీగా ప్రగతి నివేదికలు చదివారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ శేషయ్య, జడ్పీటీసీ కోటయ్య, తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో వేణు, వివిధశాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్లకు భూమిపూజ

డక్కిలి/బాలాయపల్లి/చిల్లకూరు/తడ/చిట్టమూరు/ఓజిలి, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలంలోని పాతనాలపాడు, డక్కిలి, శ్రీపురం గ్రామాల్లో శుక్రవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. పాతనాలపాడులో రూ.10 లక్షలు, శ్రీపురంలో రూ.5లక్షలు, డక్కిలిలో రూ.10 లక్షలతో సిమెంటు రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ● బాలాయపల్లి మండంలోని బాలాయపల్లిలో రూ.27 లక్షలు, కడగుంటలో రూ.8 లక్షలు, నిండలిలో రూ.10 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ● చిల్లకూరు మండలంలోని ఓడూరులో రూ.10 లక్షలు, కమ్మవారి పాళెంలో రూ.5లక్షలతో సిమెంటు రోడ్ల నిర్మాణానికి తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శి గుండాల లీలావతి, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు నాయుడు ఆధ్వర్యంలో సిమెంటు రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ● తడ మండలంలో రూ.2 కోట్లతో మురుగు కాలువలు, సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు శుక్రవారం భూమిపూజ చేశారు. ● చిట్టమూరు మండలంలోని బురదగాలి, కొత్తపాళెం, కుమ్మరిపాళెం గ్రామాల్లో సిమెంట్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ● ఓజిలి మండలం రాచపాళెంలో సిమెంటు రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు.

విద్యుత్ చార్జీల పెంపు తగదు

గూడూరు అర్బన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌చార్జీలను పెంచి ప్రజలపై భారం మోపడం సమంజసం కాదని సీపీఎం నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక ఐసీఎస్ రోడ్డులోని సబ్‌స్టేషన్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. అనంతరం ఏఈ ఏడుకొండలుకు వినతిపత్రం అందజేశారు. జోగి శివకుమార్, శ్రీనివాసులు, రమణయ్య, సురేష్, మణి, ప్రసాద్, చంద్రయ్య, చంద్రమోహన్ పాల్గొన్నారు.

నిరసన

నాయుడుపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ నాయుడుపేట విద్యుత్ కార్యాలయం ఎదుట సీఐటీయూ, సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. సీపీఎం పట్టణ కార్యదర్శి మహేష్‌బాబు, ముకుంద, వీరాస్వామి, మోహన్, ప్రతాప్ పాల్గొన్నారు.

గ్రామసభలతో భూసమస్యలకు పరిష్కారం

పెళ్లకూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రీసర్వే నిర్వహించిన పల్లెల్లో గ్రామసభలు నిర్వహించి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నట్లు తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం తాళ్వాయిపాడులో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ గతంలో చేపట్టిన రీసర్వేలో పొరబాట్లు జరిగి ఉంటే సరిచేసుకునేందుకు ఈ సభలు దోహదపడుతాయన్నారు.

చల్లకాలువలోకి వరదనీరు

కోట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కోట నుంచి కుడి, ఎడమల నుంచి సముద్రంలో కలిసే చల్లకాలువ నదిలో వరదనీరు ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదనీరు స్వర్ణముఖినది నుంచి లింక్ కలుజు ద్వారా వరదనీరు వస్తుండటంతో చల్లకాలువ కరకట్టలకు ఇరువైపులా ఉన్న గ్రామాల్లోని ఫిల్టర్ పాయింట్‌లకు భూగర్భ జలాలశాతం పెరిగే అవకాశం ఉంది.

భక్తులకిచ్చే ప్రసాదం నాణ్యంగా ఉండాలి


చెంగాళమ్మ ఆలయంలో స్టాకు రికార్డులను పరిశీలిస్తున్న సంయుక్త కమిషనర్

సూళ్లూరుపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): భక్తులకు ఇచ్చే ప్రసాదాలు నాణ్యంగా ఉండాలని దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ అన్నారు. శుక్రవారం ఆయన చెంగాళమ్మ ఆలయానికి విచ్చేసి భక్తులకు ఇచ్చే ప్రసాదాల నాణ్యతను పరిశీలించారు. స్టాక్ రికార్డును తనిఖీ చేశారు. దుకాణాల్లో విక్రయించే అమ్మవారి పూజా సామగ్రికి సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకొన్నారు. లడ్డు, పొంగలి, పులిహోర ప్రసాదాలు నాణ్యత ఉండేలా చూడాలని సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మిని ఆదేశించారు.

మొక్కుబడిగా మండల సమావేశం


సమావేశంలో వైద్య ఆరోగ్య సేవలను వివరిస్తున్న డాక్టర్ డానియేల్‌రాజు

ఓజిలి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఓజిలి మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ గడ్డం అరుణమ్మ అధ్యక్షతన ఎంపీడీవో విజయలక్ష్మి అధ్వర్యంలో జరిగింది. 10:30 గంటలకు ప్రారంభించాల్సిన సమావేశం సభ్యులు ఎవరూ రాకపోవడంతో 11:30 గంటలకు ప్రారంభమైంది. అధికారులు వారి శాఖల పనితీరు, ఇతర అంశాలను సభలో వినిపించగా సమావేశానికి హాజరైన సభ్యులు వింటూ కూర్చున్నారు. మండల సమస్యలపై ప్రస్తావన, చర్చకు ఎవరూ ఆసక్తి చూపలేదు. శాఖల వారీ సమీక్షలో భాగంగా ఓజిలి పీహెచ్‌సీ వైద్యులు డానియేల్ రాజు వైద్య ఆరోగ్య సేవలు, సీజనల్ వ్యాధుల గురించి వివరించారు. ఉపాధి, ఆర్‌అండ్‌బీ, గృహ నిర్మాణ, విద్య, పశువైద్య శాఖల అధికారులు మాట్లాడారు. సమావేశంలో తహసీల్దారు పద్మావతి, వైస్ ఎంపీపీలు ప్రసాద్ నాయుడు, మీనాక్షి, ఆరిమేనిపాడు, ఓజిలి, గ్రద్దగుంట ఎంపీటీసీ సభ్యులు రఘురామరాజు, నవీన్, విజయమ్మ, సర్పంచులు పాల్గొన్నారు.

కూటమితోనే యువతకు ఉపాధి: నెలవల


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు

నాయుడుపేట టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలోనే నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జాబ్‌మేళా పోస్టర్లను నెలవల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎంప్లాయిస్ ఎక్ఛైంజ్, సీడాప్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీ మంగళవారం సూళ్లూరుపేటలోని సత్యసాయి కల్యాణ మండపంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీసిటీ, మేనకూరు సెజ్‌లలోని 24 పరిశ్రమల్లో 1200 ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణత అయిన వారు పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజర్ లోకనాధం, టీడీపీ నాయకులు పసల గంగాప్రసాద్, చక్రపాణి, బాబు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

కోట ఆస్పత్రి స్థాయిని 50 పడకలకు పెంచండి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న కోటేశ్వరరావు

కోట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కోట ప్రభుత్వాస్పత్రి స్థాయిని 30నుంచి 50 పడకలకు పెంచాలని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కొమారి కోటేశ్వరరావు వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం అమరావతిలో మంత్రిని కలిసిన కోటేశ్వరరావు కోటలోని ప్రభుత్వాస్పత్రి గురించి వివరించారు. రోగులు పెరుగుతున్న నేపథ్యంలో ఆస్పత్రి స్థాయిని పెంచి అధునాతన సౌకర్యాలు సమకూర్చాలని కోరారు.